స్కాన్ చేయండి...
పేపర్ చదవండి...

www.rajamudranews.com

అక్షర
# రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
RNI No: TELTEL/2024/86684

సోమవారం | 26.05.2025 | సంపుటి : 2 | సంచిక :114 | పేజీలు : 8 | వెల : 2/-

**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.


సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 91824 74575

## హ్యాట్రిక్ విజయంతో
# అదిరే ముగింపు
### కోల్‌కతాపై సన్‌రైజర్స్ ఘన విజయం
### క్లాసెన్ విధ్వంసక శతకం.. హెడ్ మెరుపులు

07

సన్‌రైజర్స్ అదరగొట్టింది. పరుగుల వరదతో ఫిరోజ్‌షా కోట్లా మైదానాన్ని ముంచెత్తింది. చివరి లీగ్ మ్యాచ్‌లో 110 పరుగుల తేడాతో కోల్‌కతాను ఓడించింది. మొదట హైదరాబాద్ 3 వికెట్లకు 278 పరుగుల భారీ స్కోరు చేసింది. హెన్రిచ్ క్లాసెన్ (105 నాటౌట్, 39 బంతుల్లో 7(4), 9(6)) వీర విధ్వంసం సృష్టించాడు. ట్రావిస్ హెడ్ (76, 40 బంతుల్లో 6(4), 6(6)) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఛేదనలో కోల్‌కతా 18.4 ఓవర్లలో 168కే ఆలౌటైంది. మనీశ్ పాండే (37), హర్షిత్ (34), నరైన్ (31) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. జైదేవ్ ఉనద్కత్ (3/24), హర్ష్ దూబె (3/34), ఇషాన్ మలింగ (3/31) ప్రత్యర్థి పతనంలో కీలకపాత్ర పోషించారు.





02

### చెల్లెళ్ల తిరుగుబాటు వెనుక కాంగ్రెస్

- పంపకాల్లో తేడాల వల్లే వీధినపడిన వైఎస్, కేసీఆర్ కుటుంబాలు: కె.లక్ష్మణ్
- భాజపా రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక ఆలస్యం కావచ్చని వ్యాఖ్య



02

### ఈసెట్‌లో 96.22 శాతం పాస్

జూన్ 15 నుంచి కౌన్సెలింగ్: బాలకిష్టారెడ్డి

## త్వరలోనే పీసీసీ
# కార్యవర్గ ప్రకటన



- కేసీ వేణుగోపాల్‌తో సీఎం, పీసీసీ అధ్యక్షుడి చర్చలు
- మంత్రివర్గ విస్తరణపైనా సమాలోచనలు
- నేడు మరోసారి భేటీ

ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(పీసీసీ) రాష్ట్ర కార్యవర్గానికి తుదిరూపు ఇస్తున్నారు. అతి త్వరలోనే కాంగ్రెస్ అధిష్ఠానం జాబితా ప్రకటించనుందని తాజా సమాచారం. పీసీసీ కార్యవర్గంతో పాటు రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపై ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆదివారం రాత్రి చర్చలు జరిపారు.

హైదరాబాద్ : పీసీసీ కార్యవర్గం ఖరారులో ఇప్పటికే తీవ్ర జాప్యం జరిగిందని వారు అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. మంత్రివర్గ విస్తరణ, పార్టీ పదవులు ఆశిస్తున్న ముఖ్య నేతల గురించి చర్చించినట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. మంత్రివర్గ విస్తరణ చేపడితే ఏయే సామాజిక వర్గాలకు పదవులు ఇవ్వాలనే అంశాన్ని సీఎం అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లారు. పీసీసీ కార్యవర్గంలో తొలుత వర్కింగ్ ప్రెసిడెంట్లు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను మాత్రమే ప్రకటించే అవకాశాలున్నాయి. ఈ పదవులకు పోటీ ఎక్కువగా ఉంది. వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా నలుగురు లేదా ఐదుగురికి అవకాశమివ్వాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం. వీరిలో ఒక ఎమ్మెల్యే, ఒక ఎంపీ ఉండవచ్చని తెలుస్తోంది. ఓసీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఒక్కో వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి కేటాయించే అవకాశముంది. ఎంపీల్లో బలరాం నాయక్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఈ పదవిని ఆశిస్తున్నట్లు సమాచారం.

మిగతా 2 లో

## కవిత వ్యాఖ్యలపై
# తొందరపడి స్పందించొద్దు



- భారాస నాయకులకు కేటీఆర్ అంతర్గత సమాచారం
- కేసీఆర్‌తో భేటీ.. వివిధ అంశాలపై చర్చ
- రాజకీయ పరిణామాలు, కాళేశ్వరం కమిషన్ నోటీసులపైనా..

03

ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలపై పార్టీ నాయకులెవరూ తొందరపడి స్పందించవద్దని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్.. ముఖ్య నాయకులకు అంతర్గతంగా సమాచారమిచ్చినట్లు తెలిసింది. ఎర్రవల్లిలోని నివాసంలో భారాస అధినేత కేసీఆర్‌తో ఆదివారం కేటీఆర్ భేటీ అయ్యారు. ఇటీవల కేసీఆర్‌కు కవిత రాసిన లేఖ బయటకు వచ్చిన విషయం తెలిసిందే.

## బనకచర్లపై రేవంత్
# నోరుమెదపరెందుకు?

- 200 టీఎంసీల గోదావరి జలాలు తరలించేందుకు ఏపీ కుట్రలు
- ఎలాంటి అనుమతుల్లేకుండానే పనులు
- దీనిపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేయాలి
- భాజపా కేంద్ర మంత్రులకు తెలంగాణ ప్రయోజనాలు పట్టవా?
- మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం



బనకచర్ల ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ 200 టీఎంసీల గోదావరి జలాలను తరలించుకుపోయే కుట్ర చేస్తోందని.. ఇది తెలంగాణకు తీవ్రనష్టం చేయబోతోందని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు తెలిపారు. "గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు కొత్తది కాదా? విభజన చట్టం ప్రకారం.. కేఆర్ఎంబీ లేదా జీఆర్ఎంబీ అనుమతి తీసుకోవాలి. ఆయా పరీవాహక రాష్ట్రాలు ఒప్పుకోవాలి. ఎపెక్స్ కౌన్సిల్ అనుమతి పొందాలి. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), పర్యావరణ అనుమతులు తీసుకోవాలి.

"ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ జలవనరుల్లో తెలంగాణకు అన్యాయం జరిగింది. నేడూ కాంగ్రెస్ పాలనలో రాష్ట్రానికి ద్రోహం జరుగుతోంది. నాడు ఇదే చంద్రబాబు.. తెలంగాణ ప్రాజెక్టులను రద్దు చేయాలని, అనుమతులు ఇవ్వొద్దని, కాళేశ్వరాన్ని అడ్డుకునేందుకు లేఖలు ఎందుకు రాశారు? అయినా.. కాళేశ్వరం కొత్తది కాదు.. ప్రాణహితకు కొనసాగింపు అని వాస్తవం చెప్పి కేంద్రం నుంచి అనుమతి సాధించాం. రాష్ట్రానికి నిధుల కేటాయింపు, అనుమతుల విషయంలో అన్యాయం జరుగుతుందని గత అసెంబ్లీ సమావేశాల్లో చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. మరి ఇప్పుడెందుకు నీతిఆయోగ్ మీటింగ్‌కు వెళ్లారు? అక్కడ కనీసం బనకచర్లపై మాట్లాడలేదు. గోదావరి జలాలపై ఏపీ కుట్ర చేస్తోంది.

మిగతా 2 లో



## నాలుగు రోజులపాటు
# భారీ వర్షాలు

**హైదరాబాద్:** దేశంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించడంతో వాతావరణ పరిస్థితు లు ఒక్కసారిగా మారిపోయాయి. ఉత్తర తెలంగాణపై ద్రోణి కొనసాగుతున్న నేపథ్యం లో రాష్ట్రంలో సోమవారం నుంచి గురువారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపింది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని, ఇతర జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, ఆదిలాబాద్, నిజామాబాద్ తదితర జిల్లాల్లో వర్షాలు కురిశాయి.

## ఉత్తమ పాలన విధానాలతోనే
# వికసిత భారత్

- ఆ దిశగా కృషి చేయండి
- కులగణనతో వృద్ధి పథంలోకి బడుగులు
- ఎన్డీయే సీఎంల సమావేశంలో మోదీ
- ప్రధాని నేతృత్వాన్ని కొనియాడిన ముఖ్యమంత్రులు



**న్యూఢిల్లీ :** దేశంలో ఎన్డీయే కూటమి పాలిత రాష్ట్రాలు ఉత్తమ పాలన విధానాలను ఆచరించి, వికసిత భారత్ లక్ష్యాలు సాకారమయ్యేందుకు దోహదపడాలని ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. ఆదివారం దిల్లీలో నిర్వహించిన ఎన్డీయే పక్షాల సీఎంలు, డిప్యూటీ సీఎంల సమావేశంలో ఆయన ప్రసంగించారు. కూటమి పక్షాలు ఆయా రాష్ట్రాల్లో అనుసరిస్తున్న ఉత్తమ అభ్యాసాలపై చర్చకు సమావేశంలో ఎక్కువ సమయం కేటాయించారు. ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌరస్మృతి అమలు సహా సీఎంలు తమతమ రాష్ట్రాల్లో చేపట్టిన ఉత్తమ పాలన విధానాలు, ప్రభావవంతమైన కార్యక్రమాలు, పథకాల గురించి వివరించారు. వీటిని అధ్యయనం చేసి, ఇతర చోట్ల కూడా అమలు చేసేందుకు వీలుగా ఒక కమిటీని ఏర్పాటు చేయాలని మోదీ సూచించారు. ఎన్డీయే రాష్ట్రాలు సమన్వయంతో చేసే ప్రయత్నాలు.. వికసిత భారత్ లక్ష్యాలను సత్వరం చేరుకునేందుకు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. బడుగు బలహీనవర్గాలవారిని అభివృద్ధిపరమైన ప్రధాన స్రవంతిలోకి తీసుకువచ్చేందుకు కులగణన ఓ ముందడుగు అవుతుందని, అయితే తమ ప్రభుత్వం కుల రాజకీయాలను నమ్మబోదని చెప్పారు. అణగారిన వర్గాలకు సాధికారత కల్పించడానికి మాత్రం ప్రాధాన్యమిస్తామన్నారు.

మిగతా 2 లో

## త్వరలోనే పీసీసీ
# కార్యవర్గ ప్రకటన

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి పదవులకు ఎక్కువ మంది పోటీపడుతుండటంతో అందులో సర్దుబాటు చేయలేని ఎమ్మెల్యేకు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వడంపై చర్చలు సాగుతున్నాయి. జిల్లాలవారీగా 2017 నుంచి కాంగ్రెస్‌లో ఉంటూ పార్టీ కోసం పనిచేసిన ముఖ్యనేతల పేర్లు, వారి వివరాలను ఇప్పటికే ఏఐసీసీ సేకరించింది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రుల అభిప్రాయాలను కూడా తీసుకుంది. ఎవరికి ఏ పదవి ఇవ్వాలనే అంశంపై అధిష్ఠానానికి ఇప్పటికే స్పష్టత ఉందని సీనియర్ నేతలు తెలిపారు. ఒక్కో పదవికి ముగ్గురి పేర్లను పీసీసీ ప్రతిపాదించినట్లు సమాచారం. ఏ ఒక్క సామాజికవర్గానికి రెండు పదవులు ఇవ్వకూడదనే విధానం అనుసరించనున్నారు. ఉదాహరణకు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవులను ఒకే సామాజికవర్గానికి చెందిన ఇద్దరికి ఇవ్వరు.

### మంత్రి పదవులకు పోటాపోటీ..

మంత్రి పదవులకు ఒకే సామాజికవర్గానికి చెందిన పలువురు పోటీపడుతుండటంతో ఆ విషయంలో ఏం చేయాలనే దానిపై పార్టీ పరిశీలిస్తోంది. తెలంగాణలో మాదిగల జనాభా ఎక్కువగా ఉన్నా పదవులు తక్కువగా వచ్చాయని, మంత్రివర్గ విస్తరణలో తప్పనిసరిగా అవకాశం ఇవ్వాలని కోరుతూ ఆ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేలు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎస్సీ వర్గీకరణను దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో అమలు చేస్తున్నందువల్ల మాదిగలకు మంత్రి పదవులు దక్కాలని వారు విన్నవించినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని అధిష్ఠానం దృష్టికి సైతం తీసుకెళ్లినట్లు ఈ వర్గానికి చెందిన ఎమ్మెల్యే ఒకరు తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్సీ టికెట్ల కేటాయింపులో తమ వర్గానికి న్యాయం జరగలేదని, మంత్రివర్గ విస్తరణలోనైనా సర్దుబాటు చేయాలని కోరినట్లు ఆయన వివరించారు. మంత్రివర్గ విస్తరణ చేపడితే బీసీ, ఎస్సీ, ఓసీ, మైనార్టీలకు ఒక్కో పదవి ఇచ్చే అవకాశాలను అధిష్ఠానం పరిశీలిస్తోంది. అయితే, ఒక్కో సామాజికవర్గంలోనే ఎక్కువ మంది పోటీపడుతుండటంతో వారిలో ఎవరికివ్వాలనే దానిపైనే చర్చలు సాగుతున్నట్లు పార్టీ వర్గాలు వివరించాయి.

### తిరుగు ప్రయాణం విరమించుకొని దిల్లీలోనే..

రెండు రోజుల పర్యటన నిమిత్తం దిల్లీకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశానికి హాజరైన అనంతరం ప్రధాని మోదీ, కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రిని కలిశారు. ఆదివారం రాత్రి వరకూ దిల్లీలోని అధికార నివాసంలోనే ఉన్నారు. రాష్ట్రానికి చెందిన పార్టీ ఎంపీలతో ఇష్టాగోష్ఠిగా సమావేశమయ్యారు. ఆదివారం రాత్రి 8 గంటలకు హైదరాబాద్ తిరిగి వెళ్లాల్సి ఉండగా.. ఆ తర్వాత కేసీ వేణుగోపాల్ అపాయింట్‌మెంట్ ఖరారవడంతో రాత్రి 9.30 గంటలకు బయలుదేరాలనుకున్నారు. కానీ, సమావేశం ముగిసిన తర్వాత హైదరాబాద్ ప్రయాణాన్ని విరమించుకొని దిల్లీలోనే ఉండిపోయారు. సోమవారం వేణుగోపాల్‌తో మరోసారి సమావేశం కావాలని నిర్ణయించుకున్నారు. బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ తెలంగాణ శాసనసభలో ఆమోదించిన బిల్లును కేంద్రానికి పంపిన నేపథ్యంలో రాష్ట్రానికి చెందిన బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు సోమవారం దిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో సామాజిక న్యాయసదస్సు నిర్వహించబోతున్నారు. ఇందులో ముఖ్యమంత్రి పాల్గొనే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# చెల్లెళ్ల తిరుగుబాటు వెనుక కాంగ్రెస్

- పంపకాల్లో తేడాల వల్లే వీధినపడిన వైఎస్, కేసీఆర్ కుటుంబాలు: కె.లక్ష్మణ్
- భాజపా రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక ఆలస్యం కావచ్చని వ్యాఖ్య



**దిల్లీ:** తండ్రులు నిర్వహించిన ముఖ్యమంత్రి పదవులను అడ్డం పెట్టుకొని అక్రమంగా సంపాదించిన పదవులు, ఆస్తుల పంపకాల్లో తేడాలు రావడం వల్లే తెలుగు రాష్ట్రాల్లో వైఎస్, కేసీఆర్ కుటుంబాలు వీధినపడి రచ్చచేస్తున్నాయని భాజపా ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. ఒకప్పుడు అన్నలు వదిలిన బాణాలు ఇప్పుడు వారిపైనే తిరగబడ్డాయన్నారు. ఈ రెండు ఉదంతాల వెనుక కాంగ్రెస్ ఉందని ఆరోపించారు. తెలంగాణలో భాజపా మండల కమిటీల నియామకం పూర్తి కానందున రాష్ట్ర నూతన అధ్యక్షుడి ఎన్నిక మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని చెప్పారు. ఆయన ఆదివారం దిల్లీలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. "ఏపీలో జగన్ మీద షర్మిల నేరుగా, తెలంగాణలో కేటీఆర్ మీద కవిత పరోక్షంగా బాణాలు సంధిస్తున్నారు. వారసత్వ రాజకీయాలు, ఆస్తులు అన్నలకే పరిమితమవుతున్నాయన్న ఆవేదనతో వారు తిరుగుబాటు చేస్తున్నారు తప్పితే ప్రజల మీద మమకారంతో కాదు. రెండు రాష్ట్రాల్లో రాజకీయ పరిణామాలను గమనిస్తుంటే అన్నల మీద చెల్లెళ్లను ఉసిగొల్పడంలో కాంగ్రెస్ ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు కనిపిస్తోంది. ఏపీలో షర్మిలకు పీసీసీ అధ్యక్ష పదవి అప్పగించిన కాంగ్రెస్.. తెలంగాణలో కవితను పావుగా వాడుకుంటోందన్న వాదన వినిపిస్తోంది. తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటున్న అధికార పార్టీ ప్రజల దృష్టి మళ్లించడానికి కవితను ఒక అస్త్రంగా ప్రయోగిస్తోంది. ఆమె లేఖను బట్టి చూస్తే కుమార్తె కూడా కేసీఆర్‌ను కలవలేని పరిస్థితిని ఆయన చుట్టూ ఉన్న కోటరీ కల్పించినట్లు కనిపిస్తోంది. ఆమె వ్యాఖ్యలు పరోక్షంగా కేసీఆర్ వారసుడిగా కేటీఆర్ నాయకత్వాన్ని సవాల్ చేస్తున్నట్లు స్పష్టమవుతోంది" అని లక్ష్మణ్ పేర్కొన్నారు.



# ఈసెట్‌లో 96.22 శాతం పాస్
## జూన్ 15 నుంచి కౌన్సెలింగ్: బాలకిష్టారెడ్డి

**హైదరాబాద్:** ఈసెట్‌లో 96.22 శాతం మంది అభ్యర్థులు కనీస మార్కులు సాధించి అర్హత సాధించారు. మొత్తం 11 బ్రాంచీలకు సంబంధించి 18,928 మంది పరీక్ష రాయగా.. వారిలో 17,768 మంది ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి, ఓయూ ఉపకులపతి ఎం.కుమార్, విద్యామండలి కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, కన్వీనర్ చంద్రశేఖర్ తదితరులు ఆదివారం ఓయూలోని ఇంజినీరింగ్ కళాశాలలో ఈసెట్ ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ 7,093 మంది అమ్మాయిలు, 11,835 మంది అబ్బాయిలు పాసయ్యారని చెప్పారు. అమ్మాయిల ఉత్తీర్ణత శాతం 95.81, అబ్బాయిల ఉత్తీర్ణత శాతం 92.71గా ఉందన్నారు. ఏపీ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినా వారికి ఈసారి ప్రవేశాలు పొందేందుకు అవకాశం లేదని స్పష్టం చేశారు. జూన్ 15 నుంచి ప్రవేశాల కౌన్సెలింగ్ జరుపుతామని, త్వరలో షెడ్యూల్‌ను వెల్లడిస్తామని తెలిపారు. కార్యక్రమంలో విద్యామండలి ఉపాధ్యక్షుడు ఇటికాల పురుషోత్తం, రాష్ట్ర సాంకేతికవిద్య, శిక్షణ మండలి(ఎస్‌బీటెట్) కార్యదర్శి బి.శ్రీనివాస్, ఓయూ రిజిస్ట్రార్ నరేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పరిశ్రమలు రాష్ట్రం దాటొద్దు
## ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**హైదరాబాద్:** ఉపాధి, ఆదాయం వచ్చే పరిశ్రమలు రాష్ట్రం దాటకుండా చూడాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. ఆదివారం సాయంత్రం ప్రజా భవన్‌లో ఆయన అధ్యక్షతన పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహక (ఇండస్ట్రియల్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్) ఉప సంఘం సమావేశం జరిగింది. ఉప సంఘం సభ్యులైన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఇకనుంచి ప్రతి శనివారం సమావేశం నిర్వహిద్దామని చెప్పారు. పరిశ్రమల ఏర్పాటుతో పెద్దసంఖ్యలో అనుబంధ పరిశ్రమలు వచ్చే అవకాశం ఉంటుందని, తద్వారా యువతకు వేలల్లో ఉద్యోగాలు లభిస్తాయని, రాష్ట్ర ఖజానాకు పెద్దమొత్తంలో ఆదాయం సమకూరుతుందని... అందుకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని పేర్కొన్నారు. పరిశ్రమలకు ప్రోత్సాహం, ఇప్పటికే చేసుకున్న ఒప్పందాల అమలులో ప్రగతి, కొత్త యూనిట్ల స్థాపనకు సంబంధించిన అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. జహీరాబాద్ నిమ్జ్ ప్రాంతంలో హ్యుందాయ్ గ్లోబల్ ఇన్నోవేషన్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ స్థాపనకు ఉప సంఘం ఆమోదం తెలిపింది. ఈ సెంటర్‌ని 675 ఎకరాల్లో రూ.8,528 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయడం గొప్ప విజయంగా అభిప్రాయపడింది. దీని ఏర్పాటుతో 4,276 మంది యువతకు ఉపాధి లభిస్తుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ప్రస్తుతం ప్రారంభించబోతున్న పరిశ్రమలు రాబోయే కొన్నేళ్లలో పెద్దసంఖ్యలో ఉపాధి, ఆదాయాన్ని సమకూరుస్తాయని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. సమావేశంలో పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్‌కుమార్, సీఎంవో ముఖ్య కార్యదర్శి అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, పరిశ్రమల శాఖ డైరెక్టర్ మల్సూర్, వాణిజ్య పన్నులశాఖ కమిషనర్ హరిత, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్ పాల్గొన్నారు.

# పోటెత్తిన భక్తులు
## సరస్వతి పుష్కరాల్లో గవర్నర్ దంపతుల పుణ్యస్నానం



**కాళేశ్వరం:** సరస్వతి పుష్కరాలలో పదకొండో రోజైన ఆదివారం.. రాష్ట్రం, ఇతర రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు చేశారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సుధాదేవ్‌వర్మ దంపతులు పుష్కర స్నానం ఆచరించారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో ఉదయం 11:02 గంటలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం చేరుకున్న గవర్నర్ దంపతులకు రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరె పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం సరస్వతి వీఐపీ ఘాట్‌లో గవర్నర్ దంపతులు పుష్కరస్నానం ఆచరించి, సరస్వతి విగ్రహం వద్ద పూజలు చేశారు. కాళేశ్వర, ముక్తీశ్వర స్వామి దర్శనం చేసుకున్నారు. గవర్నర్ దంపతులకు మంత్రి శ్రీధర్‌బాబు ద్విలింగాల ప్రత్యేకతను వివరించి..స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, సరస్వతి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. ఆదివారం మాస శివరాత్రి కావడంతో ఎమ్మెల్సీ వాణిదేవి, గడ్చిరోలి ఎంపీ నామ్‌దేవ్‌రావు కిర్సాన్, సినీనటుడు, రచయిత తనికెళ్ల భరణి, సినీనటి పూనం కౌర్ స్వామివార్లకు మొక్కులు చెల్లించారు. సిరోంచ – కాళేశ్వరం అంతర్రాష్ట్ర వంతెన సమీపం నుంచి వాహనాల పార్కింగ్ ప్రాంతం వరకు ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం వరకు ట్రాఫిక్ సమస్య నెలకొంది. కాటారం–మహదేవపూర్, సిరోంచ–కాళేశ్వరం అంతర్రాష్ట్ర వంతెనపై స్వల్ప ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. పుష్కరాల్లో చివరి రోజైన సోమవారం ముగింపు ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

## తుది దశకు వచ్చిన
# ఇందిరమ్మ ఇళ్లపై దృష్టి
## 2న ఎక్కువ గృహాలు అందించేందుకు కసరత్తు



**హైదరాబాద్:** రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2న సాధ్యమైనన్ని ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. వారం రోజులే ఉండటంతో శ్లాబ్, గోడలు పూర్తి చేసుకుని తుదిదశలో ఉన్న గృహాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. మొదటి విడతలో మండలానికి ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి మొత్తం 47,377 మందికి ఇళ్ల నిర్మాణం కోసం అనుమతి పత్రాలు అందించారు. ఇందులో 23,847 మంది పనులను ప్రారంభించారు. వీటిలో తుదిదశకు వచ్చిన ఇళ్లను జూన్ 2 నాటికి పూర్తయ్యేలా చూడాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు. అప్పటికి వెయ్యి ఇళ్లనైనా పూర్తిచేసి లబ్ధిదారులకు అందించాలని భావించింది. క్షేత్రస్థాయిలో నిర్మాణ ఖర్చు ఎక్కువగా అవుతుండడం, ప్లంబింగ్, వైరింగ్ వంటి పనులకు సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సాధ్యమైనన్ని ఎక్కువ గృహాలను ఆరోజు సీఎం రేవంత్‌రెడ్డి, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేలా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

### నేడు రూ.13 కోట్లు విడుదల:

ఇందిరమ్మ ఇళ్లు దశల వారీగా పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు మిగతా పనులను వేగవంతంగా చేయడానికి సోమవారం రూ.13 కోట్లు విడుదల చేయనున్నారు. 1300 మంది లబ్ధిదారుల ఖాతాల్లో నగదును నేరుగా జమ చేస్తారు.

### ఆదివాసీలకు ఇందిరమ్మ ఇళ్లు!

ఏళ్లుగా అటవీ ప్రాంతాన్నే నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసీలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అటవీ శాఖ నుంచి అనుమతులు లభిస్తే వారి సొంతింటి కల నెరవేరే అవకాశముందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలోని 4 ఐటీడీఏ పరిధిలో ఆదిమ జాతుల కోసం 9,350 ఇళ్లు, ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే ఎస్టీలకు 8,750 ఇళ్లు.. మొత్తం 18,100 గృహాలను నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మొదటి, రెండు విడతల్లో ప్రకటించిన ఇళ్లకు అదనంగా ఈ గృహాలను మంజూరు చేయాలని నిర్ణయించింది. అయితే అటవీ శాఖ అనుమతులు ఇస్తుందా? అన్నది చర్చనీయాంశంగా మారింది. అటవీ శాఖ అధికారులతో చర్చలు జరుపుతామని, వారి అనుమతులు తీసుకొని ఈ గృహాలను నిర్మించి ఇస్తామని హౌసింగ్‌శాఖ అధికారులు పేర్కొంటున్నారు.



## బనకచర్లపై రేవంత్
# నోరుమెదపరెందుకు?

- 200 టీఎంసీల గోదావరి జలాలు తరలించేందుకు ఏపీ కుట్రలు
- ఎలాంటి అనుమతుల్లేకుండానే పనులు
- దీనిపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేయాలి
- భాజపా కేంద్ర మంత్రులకు తెలంగాణ ప్రయోజనాలు పట్టవా?
- మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం

**హైదరాబాద్:** బనకచర్ల ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ 200 టీఎంసీల గోదావరి జలాలను తరలించుకుపోయే కుట్ర చేస్తోందని.. ఇది తెలంగాణకు తీవ్రనష్టం చేయబోతోందని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు తెలిపారు. "గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు కొత్తది కాదా? విభజన చట్టం ప్రకారం.. కేఆర్‌ఎంబీ లేదా జీఆర్‌ఎంబీ అనుమతి తీసుకోవాలి. ఆయా పరీవాహక రాష్ట్రాలు ఒప్పుకోవాలి. ఎపెక్స్ కౌన్సిల్ అనుమతి పొందాలి. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), పర్యావరణ అనుమతులు తీసుకోవాలి. ఇవేవీ లేకుండా.. నిబంధనలు ఉల్లంఘించి.. ఏపీ ప్రభుత్వం రాత్రికి రాత్రి పనులు చేసే ప్రయత్నం చేస్తోంది. ఇంత జరుగుతున్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నోరు మెదపడం లేదు. రాష్ట్రం నుంచి కేంద్రంలో ఇద్దరు భాజపా మంత్రులున్నారు. వారికి తెలంగాణ ప్రయోజనాలు పట్టవా?" అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

### సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేయాలి

"ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ జలవనరుల్లో తెలంగాణకు అన్యాయం జరిగింది. నేడూ కాంగ్రెస్ పాలనలో రాష్ట్రానికి ద్రోహం జరుగుతోంది. నాడు ఇదే చంద్రబాబు.. తెలంగాణ ప్రాజెక్టులను రద్దు చేయాలని, అనుమతులు ఇవ్వొద్దని, కాళేశ్వరాన్ని అడ్డుకునేందుకు లేఖలు ఎందుకు రాశారు? అయినా.. కాళేశ్వరం కొత్తది కాదు.. ప్రాణహితకు కొనసాగింపు అని వాస్తవం చెప్పి కేంద్రం నుంచి అనుమతి సాధించాం. రాష్ట్రానికి నిధుల కేటాయింపు, అనుమతుల విషయంలో అన్యాయం జరుగుతుందని గత అసెంబ్లీ సమావేశాల్లో చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. మరి ఇప్పుడెందుకు నీతిఆయోగ్ మీటింగ్‌కు వెళ్లారు? అక్కడ కనీసం బనకచర్లపై మాట్లాడలేదు. గోదావరి జలాలపై ఏపీ కుట్ర చేస్తోంది. గోదావరి ట్రైబ్యునల్ వచ్చేలోపే.. బనకచర్ల నిర్మించి.. ప్రజాధనం వృథా కాకూడదు కాబట్టి.. 200 టీఎంసీలు కేటాయించాలని ఒత్తిడి చేసేలా.. పథకం ప్రకారం ఏపీ ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన నిర్మాణం చేపట్టింది. ఇవన్నీ తెలిసి కూడా తెలంగాణ సీఎం, నీటి పారుదల మంత్రి ఎందుకు మౌనంగా ఉంటున్నారు? వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి. ప్రత్యేక అసెంబ్లీ సమావేశం పెట్టి, బనకచర్ల ప్రాజెక్టును తెలంగాణ వ్యతిరేకిస్తుందని ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలి. ఈ విషయంపై సుప్రీంకోర్టుకు వెళ్లి న్యాయ పోరాటం చేయాలి.

### కేంద్రం వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్లండి

రాష్ట్రంలో 8 మంది చొప్పున కాంగ్రెస్, భాజపాల ఎంపీలు గెలిచి ఏం లాభం? కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కేంద్ర మంత్రులుగా ఉండి ఏం చేస్తున్నారు? కేంద్ర క్యాబినెట్‌లో ఈ విషయం ప్రస్తావించరా? పైగా బనకచర్ల ప్రాజెక్టుకు 50% నిధులను కేంద్రం గ్రాంటుగా ఇస్తుందట.. మరో 50% నిధులను ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితికి మించి రుణం తీసుకునే వెసులుబాటు కల్పిస్తారట! నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపడుతుంటే నిధులెలా ఇస్తారు? పోలవరం ద్వారా 80 టీఎంసీల నీళ్లను కృష్ణాకు తరలిస్తే.. తెలంగాణకు 45, కర్ణాటకకు 21, మహారాష్ట్రకు 14 టీఎంసీలు కేటాయించాలని గోదావరి ట్రైబ్యునల్ ఒక అవార్డు ఇచ్చింది. ఏపీ వాళ్లు పట్టిసీమ పెట్టి నీళ్లు మళ్లించారని.. కర్ణాటక, మహారాష్ట్ర కోరడంతో అవార్డు ప్రకారం వాటికి నీటి కేటాయింపులకు సీడబ్ల్యూసీ అనుమతించింది. తెలంగాణ 45 టీఎంసీలపై అడిగితే.. డీపీఆర్ వెనక్కి పంపారు. తెలంగాణకు భాజపా చేస్తున్న ద్రోహానికి ఇదొక ఉదాహరణ. ఎందుకు తెలంగాణపై భాజపాకు సవతితల్లి ప్రేమ? తెలంగాణ ప్రయోజనాలు పట్టని కేంద్ర మంత్రులకు ఆ పదవిలో ఉండే అర్హత లేదు. ఇప్పటికైనా కిషన్‌రెడ్డి చొరవ తీసుకొని.. రాష్ట్రం నుంచి అఖిలపక్షాన్ని ప్రధాని వద్దకు తీసుకెళ్లాలి. బనకచర్ల నిర్మాణాన్ని వెంటనే ఆపాలి. లేదంటే కేసీఆర్ ఆలోచన మేరకు.. దిల్లీలో సీడబ్ల్యూసీ కార్యాలయం ముందు భారాస ఆధ్వర్యంలో ధర్నా చేస్తాం" అని హరీశ్‌రావు స్పష్టం చేశారు.




# చేపలు పడుతుంటే.. పోటీలకు పిలుపొచ్చింది

## మిస్ ఇంగ్లాండ్ ఫస్ట్ రన్నరప్ చార్లెట్ గ్రాంట్

**హైదరాబాద్:** తెలంగాణ ఆతిథ్యం తనకు ఎంతగానో నచ్చిందని మిస్ ఇంగ్లాండ్ (ఫస్ట్ రన్నరప్) చార్లెట్ గ్రాంట్ తెలిపారు. పలు వ్యక్తిగత కారణాలతో ప్రపంచ సుందరి పోటీల నుంచి మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ వైదొలిగిన తర్వాత ఆమె స్థానంలో చార్లెట్ గ్రాంట్ వచ్చారు."హైదరాబాద్ ప్రజల ఆప్యాయత నచ్చింది. వారు స్వాగతించిన తీరు బాగుంది. నేను సందర్శించని ప్రదేశాలను రానున్న రోజుల్లో చూడటానికి ప్రయత్నిస్తా. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వేడుకలు, సంబరాలు చూస్తుంటే ముచ్చటేస్తోంది" అని తెలిపారు. "నాకు లభించిన ఈ అవకాశం.. అరుదైనది, ప్రతిష్మాత్మకమైనది. అలవాటులో భాగంగా పెరట్లో చేపలు పడుతుండగా ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొనాలనే సమాచారం వచ్చింది. ఎంతో సంతోషపడ్డాను. ఫ్యాషన్ షోలో తెలంగాణ సంప్రదాయ వస్త్రాలతో పాల్గొనడం కొత్తగా అనిపించింది. క్యాన్సర్‌తో బాధపడుతున్న వారి సహాయార్థం.. 'బ్యూటీ విత్ ఎ పర్పస్'లో భాగంగా పెద్దఎత్తున విరాళాలు సేకరించాను. ఇప్పటికే పలు పోటీలు పూర్తయ్యాయి. రానున్న పోటీల్లో వందశాతం కృషి చేస్తా. ఈ పోటీల్లోని ప్రతి సందర్భం జీవితాంతం గుర్తుండిపోయేలా పదిలం చేసుకుంటా" అని చార్లెట్ గ్రాంట్ తెలిపారు.

# మిస్ ఇంగ్లాండ్ ఆరోపణల్లో వాస్తవమెంత..?

- ఇతర పోటీదారులతో మాట్లాడిన ముగ్గురు మహిళా ఐపీఎస్‌లు
- భద్రతపై వారి అభిప్రాయాల వీడియో చిత్రీకరణ

**హైదరాబాద్:** మిస్‌వరల్డ్ పోటీల నిర్వహణ తీరుపై మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ చేసిన ఆరోపణల్లో వాస్తవాలను నిగ్గు తేల్చడంపై మహిళా భద్రత విభాగం దృష్టి సారించింది. ఈ మేరకు భద్రత విభాగం డీజీ శిఖాగోయెల్, డీఐజీ రెమారాజేశ్వరితోపాటు సైబరాబాద్ స్పెషల్ బ్రాంచి డీసీపీ సాయిశ్రీ ఆదివారం ఉదయం మాదాపూర్ ట్రైడెంట్ హోటల్‌లో పలువురు పోటీదారులతో నేరుగా మాట్లాడారు. వారి భద్రతకు సంబంధించిన పలు అంశాలపై ఆరా తీశారు. ఈవెంట్ల వేదికలతోపాటు హోటళ్లు, ఇతర పర్యాటక ప్రాంతాలకు వెళ్లిన సందర్భాల్లో వారికి ఎదురైన పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. వారు చెప్పే విషయాలను సమాచార, ప్రజాసంబంధాల విభాగం సిబ్బందితో వీడియో తీయించారు. దాదాపు 50 మంది వరకు పోటీదారుల అభిప్రాయాలు రికార్డు చేశారు. ముఖ్యంగా మిల్లా మాగీ లేవనెత్తిన 'టేబుల్' వ్యవహారంపై.. ఆరోజు ఆమెతోపాటు అదే టేబుల్‌పై కూర్చున్న మిస్ వేల్స్‌ను అడిగి ఏం జరిగిందో తెలుసుకున్నారు. మరోవైపు మిస్‌వరల్డ్ సీఈవో జూలియా మోర్లీతోపాటు పర్యాటకశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, ఇతర అధికారుల నుంచీ వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది.

### అన్నీ నిరాధార ఆరోపణలు: జయేశ్‌రంజన్

మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని జయేశ్‌రంజన్ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన ఈ వివాదంపై స్పందించారు. 'మిల్లా మాగీ ఇక్కడ ఉన్నది ఎనిమిది రోజులు మాత్రమే. ఆమె ఆరోపణలపై ఇతర పోటీదారులతో మాట్లాడగా.. వారెవరూ తమకెలాంటి ఇబ్బందీ ఎదురుకాలేదని వెల్లడించారు. చౌమొహల్లా ప్యాలెస్‌లో మిస్ ఇంగ్లాండ్, మిస్ వేల్స్ ఒకే టేబుల్‌పై ఉన్నారు. వారితోపాటు సీనియర్ అధికారి, ఆయన భార్య, కోడలు, మరో మహిళ కూర్చున్నారు. అక్కడ తమతో ఎవరూ తప్పుగా ప్రవర్తించలేదని మిస్ వేల్స్ స్పష్టం చేశారు. మాగీ ఆరోపణలపై మిస్‌వరల్డ్ నిర్వాహకులు యూకేలో విచారిస్తున్నారు. ఆమెను ఇంటర్వ్యూ చేసిన టాబ్లాయిడ్‌కు కూడా అంత ప్రాధాన్యం లేదు' అని వివరించారు.

# మధుమేహ రోగులకు శుభవార్త.. ఇకపై శ్వాసతోనే షుగర్ టెస్ట్

**ఢిల్లీ:** మధుమేహ బాధితుల్లో చక్కెర స్థాయిలను గుర్తించాలంటే రక్తం తీసి గ్లూకోమీటర్‌తో పరీక్షించాల్సి ఉంటుంది. ఈ ఇబ్బంది లేకుండా కేవలం శ్వాసతోనే చక్కెర స్థాయిలను గుర్తించే పరికరాన్ని మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్‌లో ఉన్న జటాశంకర్ త్రివేది ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు రూపొందించారు. ఇది సూదిని గుచ్చకుండానే, అంటే శరీరం నుంచి రక్తాన్ని తీయకుండానే షుగర్ స్థాయిని గుర్తించగల పరికరం. ఇందులో శ్వాసను ఊదాలి. దాన్ని విశ్లేషించి, కొన్ని సెకన్లలో చక్కెర స్థాయిని తెలియజేస్తుంది. ఇది కచ్చితమైన చక్కెర స్థాయిని వెల్లడించనప్పటికీ, రీడింగ్‌ను మూడు విధాలుగా చూపిస్తుంది. 'లో' అంటే శరీరంలో చక్కెర స్థాయి తక్కువగా ఉందని, 'మోడరేట్' అంటే అది సాధారణంగా ఉందని, 'హై' అని చూపిస్తే ఎక్కువగా ఉందని అర్థం.




### 8ఏళ్ల క్రితమే ప్రాజెక్ట్ ప్రారంభం

"2017లో ఈ ప్రాజెక్ట్ చేయడం ప్రారంభించాం. షుగర్ రోగుల్లో కీటోజెనిక్ జీవక్రియ ప్రారంభమై వారి శరీరం లోపల కీటోన్లు ఏర్పడతాయి. అప్పుడు కీటోన్లలో ఉండే అసిటోన్ వారి శ్వాసలోకి వస్తుంది. అటువంటి పరిస్థితిలో అసిటోన్, గ్లూకోజ్ మధ్య సంబంధాన్ని అధ్యయనం చేశాం. దీని ఆధారంగా ఈ యంత్రాన్ని కనుగొన్నాం. దీనికి 2023లో పేటెంట్ లభించింది. అసిటోన్, గ్లూకోజ్ మధ్య సంబంధాన్ని అధ్యయనం చేసి వాటి నిష్పత్తిని స్పష్టం చేయడానికి కోడింగ్ చేశాం. తరువాత రెండింటి మధ్య సంబంధాన్ని ఏర్పరచడానికి ప్రోగ్రామింగ్ చేశాం. అనంతరం ఇంజనీరింగ్ సహాయంతో ఈ ప్రాజెక్టు పూర్తైంది" అని ఈ ప్రాజెక్టులో పాల్గొన్న ప్రొఫెసర్ దుర్గేశ్ అగాసే తెలిపారు.

# కవిత వ్యాఖ్యలపై తొందరపడి స్పందించొద్దు

- భారాస నాయకులకు కేటీఆర్ అంతర్గత సమాచారం
- కేసీఆర్‌తో భేటీ.. వివిధ అంశాలపై చర్చ
- రాజకీయ పరిణామాలు, కాళేశ్వరం కమిషన్ నోటీసులపైనా..



**హైదరాబాద్:** ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలపై పార్టీ నాయకులెవరూ తొందరపడి స్పందించవద్దని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్.. ముఖ్య నాయకులకు అంతర్గతంగా సమాచారమిచ్చినట్లు తెలిసింది. ఎర్రవల్లిలోని నివాసంలో భారాస అధినేత కేసీఆర్‌తో ఆదివారం కేటీఆర్ భేటీ అయ్యారు. ఇటీవల కేసీఆర్‌కు కవిత రాసిన లేఖ బయటకు వచ్చిన విషయం తెలిసిందే. దానిపై ఆమె పలు కీలక వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ దేవుడని.. కానీ, ఆయన చుట్టూ దయ్యాలున్నాయని, భారాసలో కోవర్టులను దూరం పెట్టాలని వ్యాఖ్యానించారు. ఈ పరిణామాల నేపథ్యంలో కేసీఆర్, కేటీఆర్‌ల భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. పార్టీలో అంతర్గత విభేదాలున్నాయంటూ జరుగుతున్న ప్రచారం, విమర్శలపై వారు చర్చించినట్లు సమాచారం. కవిత రాసిన లేఖ, అమెరికా పర్యటన నుంచి తిరిగివచ్చిన తర్వాత ఆమె చేసిన వ్యాఖ్యలు తదితర అంశాలు ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. ఈ తరహా ప్రచారానికి, విమర్శలకు, పార్టీలో వ్యక్తమయ్యే భిన్నాభిప్రాయాలకు తొందరపడి స్పందించాల్సిన అవసరం లేదని, ఈ విషయాలపై ఎక్కువగా చర్చిస్తే.. పార్టీ నాయకులు, కార్యకర్తల్లో అనవసరమైన గందరగోళం నెలకొనే అవకాశాలున్నాయని కేసీఆర్ పేర్కొన్నట్లు సమాచారం. పార్టీలో అంతర్గతంగా చర్చించుకోవాల్సిన అంశాలు ఇప్పటికే బహిర్గతమయ్యాయని, జరిగిన పరిణామాల పట్ల పార్టీ నాయకులెవరూ బహిరంగ వేదికలపై, టీవీల చర్చల్లో మాట్లాడొద్దని ఆయన సూచించినట్లు తెలిసింది. కేసీఆర్‌తో సమావేశం అనంతరం కేటీఆర్ తనకు సన్నిహితులైన నాయకులతో ఇదే విషయం చెప్పినట్లు సమాచారం. సామాజిక మాధ్యమాల్లో కవిత అనుకూలురు చేస్తున్న ప్రచారంపైనా కేసీఆర్, కేటీఆర్‌లు చర్చించినట్లు తెలిసింది.

### కాళేశ్వరం కమిషన్ నోటీసులపై న్యాయనిపుణులతో సంప్రదింపులు

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో గత నెల 27న జరిగిన పార్టీ రజతోత్సవ సభ అనంతరం జాతీయ, రాష్ట్ర స్థాయుల్లో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు, వాటిపై భారాస స్పందిస్తున్న తీరుపై కేసీఆర్, కేటీఆర్‌లు చర్చించినట్లు సమాచారం. కాళేశ్వరం కమిషన్ నోటీసులపై ఎలా స్పందించాలనే అంశంపైనా చర్చించినట్లు తెలిసింది. కమిషన్‌ను కలిసి నేరుగా సమాధానం ఇవ్వాలా? లేదా రాతపూర్వకంగా ఇవ్వాలా? అసలు ఇవ్వాలా? వద్దా? తదితర అంశాలపై న్యాయనిపుణులతో సంప్రదించి నిర్ణయం తీసుకోనున్నారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా భారాస తరఫున చేపట్టాల్సిన కార్యక్రమాలపై కేటీఆర్‌కు కేసీఆర్ దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. రాబోయే రోజుల్లో పార్టీపరంగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, కార్యాచరణ, జూన్ రెండో వారంలో పార్టీ సభ్యత్వ నమోదు, సంస్థాగత నిర్మాణం, కమిటీల ఏర్పాటు తదితరాలూ చర్చలో ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. త్వరలో పార్టీ విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేసి, సభ్యత్వ నమోదుకు సంబంధించి మార్గదర్శకాలు ఇవ్వాలని కేసీఆర్ ఆదేశించినట్లు తెలిసింది. డిజిటల్ సభ్యత్వ నమోదుకు ఏర్పాట్లు, అందుకు రూపొందించిన యాప్‌నకు సంబంధించిన వివరాలపై కేసీఆర్ ఆరా తీసినట్లు సమాచారం. పార్టీని బలోపేతం చేయడంపైనే ప్రధానంగా దృష్టి పెట్టాలని, అందుకు అనుగుణంగా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని కేటీఆర్‌కు ఆయన సూచించినట్లు తెలిసింది.

### 28న అమెరికాకు కేటీఆర్

అమెరికాలోని డాలస్‌లో జూన్ 1న జరిగే పార్టీ రజతోత్సవ సభకు హాజరయ్యేందుకు ఈ నెల 28న కేటీఆర్ బయలుదేరి వెళ్లనున్నారు. డాలస్ సభలో ప్రసంగించాల్సిన అంశాలపై కేసీఆర్‌తో కేటీఆర్ చర్చించినట్లు సమాచారం. ప్రవాస తెలంగాణవాసులతో జరపాల్సిన భేటీలపై కేసీఆర్ దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. జూన్ 2న జరిగే తెలంగాణ ఆవిర్భావ వేడుకలను తెలంగాణ భవన్‌లో నిర్వహించాలని నిర్ణయించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించే బాధ్యతను మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారికి అప్పగించాలని నిర్ణయించినట్లు తెలిసింది.

# ఉత్తమ పాలన విధానాలతోనే వికసిత భారత్



(మొదటిపేజీ తరువాయి)

"రక్షణరంగంలో దేశం సాధించిన స్వయం సమృద్ధికి ఆపరేషన్ సిందూర్ విజయం ఒక తార్కాణం. ఇలాంటి అంశాలపై మాట్లాడేటప్పుడు ఎక్కడా హద్దు మీరవద్దు. ఈ ఆపరేషన్లో సైనిక బలగాలు ఎంతో ధైర్యసాహసాలతో పరాక్రమాన్ని ప్రదర్శించాయి. అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను వేగంగా తీర్చిదిద్దడం, శక్తిమంతమైన.. స్వయం సమృద్ధ దేశంగా తయారు చేయడం మన లక్ష్యం" అని మోదీ చెప్పారు.

### ఆత్మవిశ్వాసాన్ని పెంచిన ఆపరేషన్ సిందూర్

'ఆపరేషన్ సిందూర్' వల్ల భారతీయుల్లో ఆత్మవిశ్వాసం ఇనుమడించిందని పేర్కొంటూ ఈ సమావేశం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఉగ్రవాదులకు బుద్ధిచెప్పడంలో ప్రధాని మోదీ సాహసోపేత నాయకత్వాన్ని కనపరిచారని కొనియాడింది. రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ ఈ మేరకు ప్రవేశపెట్టిన తీర్మానం ఆమోదం పొందింది. సైనిక దళాలకు మోదీ అన్నివేళలా మద్దతుగా నిలుస్తున్నారని పేర్కొంది. ఉగ్రవాదులకు, వారి ప్రాయోజకులకు భారత సైన్యం దీటైన సమాధానం ఇచ్చిందని కొనియాడింది. సమావేశంలో ప్రధానితో పాటు కేంద్ర మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్, జె.పి.నడ్డా తదితరులు పాల్గొన్నారు. కుప్పంలో నూతన గృహప్రవేశ కార్యక్రమం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సమావేశానికి రాలేకపోయారు. ఆయన మినహా 20 మంది సీఎంలు, 18 మంది డిప్యూటీ సీఎంలు హాజరయ్యారు. పహల్గాం దాడిలో ప్రాణాలు కోల్పోయినవారికి సమావేశం నివాళులర్పించింది. దేశవ్యాప్తంగా కులగణనను చేపట్టాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రశంసిస్తూ మరో తీర్మానాన్ని ఈ సమావేశం ఆమోదించింది. పాల్గొన్న ముఖ్యమంత్రుల్లో హిమంత బిశ్వశర్మ (అస్సాం), యోగి ఆదిత్యనాథ్ (యూపీ), రేఖా గుప్తా (దిల్లీ), దేవేంద్ర ఫడణవీస్ (మహారాష్ట్ర), నీతీశ్ కుమార్ (బిహార్), భజన్‌లాల్ శర్మ (రాజస్థాన్), నెఫ్యూ రియో (నాగాలాండ్), కాన్రాడ్ సంగ్మా (మేఘాలయ), మాణిక్ సాహా (త్రిపుర), పెమా ఖండూ (అరుణాచల్‌ప్రదేశ్), మోహన్‌చరణ మాఝి (ఒడిశా), నాయబ్ సింగ్ సైనీ (హరియాణా), పుష్కర్ సింగ్ ధామీ (ఉత్తరాఖండ్), ప్రమోద్ సావంత్ (గోవా), మోహన్ యాదవ్ (మధ్యప్రదేశ్), భూపేంద్ర పటేల్ (గుజరాత్) తదితరులు ఉన్నారు.

### ఆ అనుభవాలు వినడం అద్భుతంగా ఉంది: మోదీ

సమావేశం ముగిసిన అనంతరం ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. సీఎంలతో కలిసి తీసుకున్న ఫొటోను, చర్చించిన అంశాల సారాంశాన్ని 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. "అనేక అంశాలపై సుదీర్ఘంగా చర్చించాం. నీటి సంరక్షణ, ఫిర్యాదుల పరిష్కారం, పరిపాలన వ్యవస్థల్ని బలోపేతం చేయడం, విద్య, మహిళా సాధికారత, క్రీడలు, విభిన్న రంగాల్లో ఉత్తమ పద్ధతులను ఆయా రాష్ట్రాలు ప్రదర్శించాయి. ఈ అనుభవాలను వినడం చాలా అద్భుతంగా ఉంది" అని తెలిపారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు చేపట్టే పథకాలు ప్రజలకు సమర్థవంతంగా చేరేలా చూడాలని సూచించారు. పారిశుద్ధ్యం, ఆరోగ్య సంరక్షణ, యువత సాధికారత, వ్యవసాయం, సాంకేతికత వంటి కీలక రంగాల్లో బలమైన వ్యవస్థను నిర్మించడంపై ఈ సమావేశంలో మాట్లాడినట్లు పేర్కొన్నారు.

# మధ్యప్రదేశ్‌లో మరో 'నిర్భయ' దారుణం

## గిరిజన మహిళపై కామాంధుల హత్యాచారం

**ఖండవా:** మధ్యప్రదేశ్‌లో నిర్భయ తరహా దారుణ ఘటన జరిగింది. ఓ గిరిజన మహిళ (45)పై కొందరు కామాంధులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం ఆమె ప్రైవేటు భాగాల్లోకి ఇనుప రాడ్డును చొప్పించారు. పోలీసుల కథనం ప్రకారం.. ఖండవా జిల్లాలోని ఓ గ్రామంలో శుక్రవారం ఓ వివాహ కార్యక్రమం జరిగింది. ఈ పెళ్లికి సమీప గ్రామ ప్రజలు హాజరయ్యారు. బాధితురాలు తన కుటుంబంతో కలిసి వచ్చింది. శుక్రవారం రాత్రి ఈమె అకస్మాత్తుగా అదృశ్యమైంది. శనివారం ఉదయం గ్రామంలోని ఓ ఇంటి వెనుక బాధితురాలు పడి ఉండటాన్ని కొందరు మహిళలు గమనించారు. వెంటనే ఆమె కుటుంబసభ్యులు ఇంట్లోకి తీసుకువెళ్లారు. తనపై జరిగిన అఘాయిత్యాన్ని చెప్పే ప్రయత్నంలోనే ఆమె తుదిశ్వాస విడిచింది. చాలాచోట్ల తీవ్రమైన గాయాల గుర్తులతో శరీరం రక్తమోడుతోంది. మృతదేహాన్ని ఖండవా ఆసుపత్రికి తరలించగా గర్భాశయం కూడా బయటకు వచ్చినట్లు వైద్యులు తెలిపారు. బాధిత కుటుంబం శనివారం మధ్యాహ్నం పోలీసులకు ఫిర్యాదు చేసింది. రోశ్నీ చౌకీ పోలీసులు గాలింపు చేపట్టి బాధితురాలి



గ్రామానికి చెందిన ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మహిళపై సామూహిక అత్యాచారం జరిగిందని, అదుపులోకి తీసుకొన్న అనుమానితులను విచారిస్తున్నట్లు ఏఎస్పీ రాజేశ్ రఘువంశీ తెలిపారు.

# ఉక్రెయిన్‌పై అతి పెద్ద గగనతల దాడి

**కీవ్:** కాల్పుల విరమణ కోసం ఒకవైపు మంతనాలు జరుగుతున్న వేళ ఉక్రెయిన్‌పై రష్యా అతిపెద్ద వైమానిక దాడి చేసింది. ఉక్రెయిన్ రాజధాని కీవ్ సహా పలు ప్రాంతాలు లక్ష్యంగా 367 డ్రోన్లు, క్షిపణులు ప్రయోగించింది. మూడేళ్లుగా జరుగుతున్న యుద్ధంలో ఇదే అతిపెద్ద వైమానిక దాడి అని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. ఉక్రెయిన్‌పై రష్యా 69 క్షిపణులు, 298 డ్రోన్లను ప్రయోగించినట్లు వెల్లడించారు. ఉక్రెయిన్ రాజధాని కీవ్ బాంబు మోతలతో దద్దరిల్లింది. రష్యా దాడిలో ఉక్రెయిన్‌లో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇందులో ముగ్గురు చిన్నారులు ఉన్నట్లు తెలుస్తోంది. 60 మందికిపైగా గాయపడ్డారు. 80 నివాస భవనాలు సైతం ధ్వంసమయ్యాయి. దాదాపు 27 చోట్ల అగ్ని ప్రమాదాలు



సంభవించాయి. ఇరాన్ రూపొందించిన షాహెద్ డ్రోన్లను ఉక్రెయిన్‌పై రష్యా ప్రయోగించింది. రష్యా దాడులకు భయపడి వందలాది ఉక్రెయిన్ పౌరులు అండర్‌గ్రౌండ్ మెట్రో స్టేషన్లలోకి వెళ్లి తలదాచుకున్నారు.



# వినోదం కోసం ఆడే పేకాట అనైతిక చర్య కిందకు రాదు

## ఓ కేసు విచారణలో సుప్రీంకోర్టు వ్యాఖ్య

**ఢిల్లీ:** బెట్టింగ్, జూదం వంటి ఉద్దేశం లేకుండా కేవలం వినోదం కోసం పేకాట ఆడటం అనైతిక చర్య కిందకు రాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. కర్ణాటకలోని ఓ సహకార సంఘానికి డైరెక్టర్ ఎన్నికైన హనుమంతరాయప్ప వైసీ అనే వ్యక్తికి పేకాట కేసులో శిక్ష పడిందని ఆయన ఎన్నికను అధికారులు రద్దు చేశారు. దీన్ని కర్ణాటక హైకోర్టు కూడా సమర్థించింది. ఈ నేపథ్యంలో తన ఎన్నిక రద్దును సవాల్ చేస్తూ హనుమంతరాయప్ప సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై ఇటీవల విచారణ చేపట్టిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం స్పందిస్తూ "పేకాట ఆడుతూ పట్టుబడ్డ హనుమంతరాయప్పతో పాటు మరికొందరికి ఎటువంటి విచారణ లేకుండానే రూ.200 జరిమానా విధించినట్లు గుర్తించాం. మన దేశంలోని వివిధ ప్రాంతాల్లో పేకాట ఆడటంలో చాలా విధానాలు ఉన్నాయి. ప్రతి దాంట్లో అనైతిక చర్య దాగి ఉంటుందని చెప్పడం కష్టం. ప్రత్యేకించి బెట్టింగ్, జూదం ఉద్దేశం లేకుండా కేవలం వినోదం కోసం ఆడే ఆటలో అనైతిక చర్య ఉందని చెప్పడం ఇంకా కష్టం. అందువల్ల ఈ కేసులో పిటిషన్‌దారుకు పడిన శిక్షతో ఆయన ఎన్నికను పక్కన పెట్టడం సరికాదు. ఆయన ఎన్నిక చెల్లుతుంది. తన పదవీకాలం ఉన్నంతవరకు కొనసాగుతారు" అని పేర్కొంది.



# స్టాక్ ట్రేడింగ్ పేరుతో మోసం

**హైదరాబాద్ :** స్టాక్ ట్రేడింగ్‌లో లాభాలు ఇస్తామంటే నమ్మి ఓ విశ్రాంత ఉద్యోగి మోసపోయారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. షేక్‌పేట్ టోలిచౌకి పాల్కన్ కాలనీకి చెందిన విశ్రాంత ఉద్యోగి(65)కి కీర్తి సరాఫ్ అనే మహిళ వాట్సప్ నంబరు నుంచి స్టాక్‌మార్కెట్ పేరిట సందేశం వచ్చింది. తాను సూచించిన షేర్లలో పెట్టుబడి పెడితే పెద్దమొత్తంలో లాభాలు వస్తాయని చెప్పడంతో పాటు అతని వాట్సప్ నంబరును 89 మందితో కూడిన గ్రూప్‌లో చేర్చింది. అందులో తమకు లాభాలు వచ్చాయంటూ పెద్దఎత్తున చర్చ జరిగింది. దీంతో పెట్టుబడి పెట్టడానికి విశ్రాంత ఉద్యోగి సరేనన్నారు. వెంటనే ఆయనకు ట్రేడింగ్ యాప్ లింక్ పంపి డౌన్‌లోడ్ చేయించారు. మొదటిసారి రూ.2 లక్షలు పెట్టుబడి కింద పెట్టారు. దానికి కొంత లాభాలు ఇచ్చారు. డబ్బు ఉపసంహరించుకోవడానికి అనుమతినిచ్చారు. ఈక్రమంలో బాధితుడు విడతల వారీగా రూ.74.36 లక్షలు పెట్టేశారు. రూ.1.50 కోట్ల లాభం వచ్చిందని యాప్‌లో చూపించారు. ఆ మొత్తాన్ని డ్రా చేసుకుందామంటే అవతలి వ్యక్తులు నిరాకరించారు. పైగా రూ.22 లక్షలు కట్టాలంటూ పట్టుబట్టారు. కాదని చెప్పడంతో వాట్సప్ గ్రూప్ నుంచి బాధితుడిని తొలగించేశారు. దాంతో బాధితుడు సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక



## అమరుల స్ఫూర్తితో సంక్షేమ బోర్డు సాధిస్తాం

### టియు జెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్

**వలిగొండ రాజముద్ర న్యూస్:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కొట్లాడిన ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు లక్ష్యంగా అమరుల స్ఫూర్తితో సంక్షేమ బోర్డు సాధిస్తామని తెలంగాణ ఉద్యమకాల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ అన్నారు. ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం ఆనాడు సమైక్య పాలకులకు ముచ్చెమటలు పట్టించి ఆంధ్ర పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించి రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమకారులను గత ప్రభుత్వాలు మోసం చేశాయని రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమకారులు హక్కులను సాధించుకోవడం పెద్ద కష్టమేమి కాదని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను జూన్ 2లోగా స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు ఈ సమావేశంలో రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ మంటి రమేష్, యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా అధ్యక్షురాలు చేర్యాల సుగుణమ్మ, భువనగిరి మండల అధ్యక్షులు కొండాపురం శ్రీనివాస్, వలిగొండ మండల అధ్యక్షులు గాజుల యాదగిరి, మండల కార్యదర్శి మంటి లింగయ్య, గంగాధర్ సత్తయ్య, కానుకుంట్ల పుష్పలత తదితరులు పాల్గొన్నారు.





## న్యూ బాలాజీ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్ ప్రారంభోత్సవం

- ముఖ్య అతిథులుగా శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి
- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**వలిగొండ రాజముద్ర న్యూస్ :** రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనాలని ఒక ఆలోచనతోనే దాదాపు 7వేలకు పైగా ధాన్యం సేకరణ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ దర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం లోని ముద్దాపురం గ్రామంలో న్యూ బాలాజీ ఆగ్రో రైస్ ఇండస్ట్రీస్ నూతన మిల్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వారితోపాటు భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. వారికి రైస్ మిల్ యాజమాని నల్ల వెంకట్ రెడ్డి - లలిత దంపతులు వారికి పుష్పగుచ్ఛమిచ్చి శాలువాతో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ మిల్ టెక్ సంస్థ అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఆటోమేటిక్ ప్రాడి డ్రైయింగ్ ప్లాంట్ రూపొందించడం ఎంతో గర్వకారణం అని అన్నారు. దీని ద్వారా రా గంటకు 8 టన్నుల ఉత్పత్తిని అందజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిల్ టెక్ ఈ డి అండ్ సీఈవో రాజన్ అగర్వాల్, సీనియర్ డిజిఎం రమణ, జిఎం ఎంకే హేమచంద్ర, ఈవీపీ రాజేష్ రైస్ మిల్ అసోసియేషన్ కార్యవర్గం సభ్యులు, పలువురు నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## వ్యాయామాలు.. వెన్నుకు దన్ను

**నిటారుగా నిలవలేం. తీరుగా కూర్చోలేం. నాలుగు అడుగులు నడవలేం. కనీసం హాయిగా నిద్ర కూడా పోలేం. అదీ... నడుము నొప్పి అంటే! కుర్రకారు నుంచి వృద్ధుల వరకూ దాదాపు అందర్నీ వేధిస్తోంది. ఈ ఇబ్బందిని తప్పించుకోవడానికి వ్యాయామం ఒకటే మార్గం! ఎంత బిజీగా ఉన్నా నిత్యం వెన్నును మరింత దృఢతరం చేసే కొన్ని తేలికపాటి వ్యాయామాలు చెయ్యాలి! అప్పుడే మన వెన్ను మనకు దన్నుగా నిలుస్తుంది.**

నడుము నొప్పి ఎన్నో కారణాలతో రావచ్చు. కానీ 90-95 శాతం మందిలో మాత్రం దీనికి తీవ్రమైన అనారోగ్య సమస్యలేం కారణం కాదు. చాలామందిలో అస్తవ్యస్తమైన జీవనశైలి కారణంగా నడుము మీద ఒత్తిడి పెరిగి వచ్చే నొప్పులే ఎక్కువ. దాదాపు 80-85 మంది జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు దీన్ని అనుభవిస్తున్నారని గణాంకాలు చెబుతున్నా నేటి మారుతున్న జీవనశైలి కారణంగా ఇప్పుడీ సమస్య చాలా చిన్నవయసులోనే వేధించటం మొదలుపెడుతోంది. ఇటువంటి వెన్నునొప్పి ఏమంత ప్రమాదకరం కాకపోయినా ఒకసారి మొదలైతే ఇంటి పనులు, ఆఫీసు పనులు, ప్రయాణాలు.. అన్నీ ఇబ్బందికరంగా పరిణమించి జీవితం దుర్భరంగా, నరకంగా మారుతుంది. అందుకే అంతా వెన్నును విస్మరించకుండా దాని మీద కాస్త శ్రద్ధ పెట్టటం అవసరం.

మన వెన్ను లేలేత కొమ్మలా వంగుతుంటుంది, కానీ అదే సమయంలో గట్టి కర్రలా దృఢంగానూ ఉంటుంది. అందుకే ఇదో సంక్లిష్టమైన నిర్మాణం. దీనిలో దండ కట్టినట్టుండే ఎముక పూసలు, వాటి మధ్య మెత్తటి డిస్కులు, వాటిని కదిలించే కండరాలు, వాటికి దృఢత్వాన్నిచ్చే టెండన్లు.. ఇలా రకరకాల భాగాలు అనుసంధానమై, కలిసికట్టుగా కదులుతుంటాయి. వీటిలో దేనిలో సమస్య తలెత్తినా పక్క భాగాలపై ప్రభావం పడుతుంది. అంతిమంగా ఇది వెన్నునొప్పికి దారి తీస్తుంది. వీటి మధ్య డిస్కులు జారినా, నాడులు నొక్కుకున్నా.. ఇలా చాలా కారణాల వల్ల రావచ్చుగానీ ఇటువంటి తీవ్ర సమస్యలు లేకుండా కేవలం దైనందిన జీవితంలో భంగిమలు సరిగా లేకపోవటం, దాని మూలంగా ఈ కండరాలు, టెండన్ల వంటి వాటి మీద ఒత్తిళ్లు పెరగటం, అవి బలహీనపడటం వల్లే చాలామందిలో నొప్పులు వేధిస్తున్నాయి.

మొగ్గలోనే వంచాలి!

జీవనశైలి కారణంగా వచ్చే రకం నడుము నొప్పులు- సాధారణంగా ఒకేసారి హఠాత్తుగా రావు. ఆరంభ దశలో ఏదైనా పని చేస్తున్నప్పుడు కొద్దిపాటి అసౌకర్యంలా మొదలై క్రమేపీ రోజురోజుకూ పెరుగుతుంటాయి. చాలామంది ఇలా అసౌకర్యంగా ఉన్న దశలో నిర్లక్ష్యం చేసి తిరిగేస్తూ, ముదురుతున్న దశలో ఏవో నొప్పుల బిళ్లలు వేసుకుని నెట్టుకొద్దామని చూస్తుంటారు. ఈ ధోరణి వల్ల చివరికి ఏ కాస్త పని చేసినా కూడా తీవ్రమైన నొప్పి వేధించే స్థితికి చేరుకుంటారు. కాబట్టి నొప్పి ముదరక ముందే వెన్ను వ్యాయామాలను ఆశ్రయించటం ఒక్కటే సరైన పరిష్కారం!

### భంగిమల మీద దృష్టి

మన రోజువారీ పనులు చూస్తే నిలబడటం, కూర్చోవటం, చాలాసేపు ఒకే భంగిమలో ఉండిపోయి పనిచేస్తుండే 'స్టాటిక్' భంగిమలు కొన్ని కనబడతాయి. వీటిల్లో వెన్నెముక కదలికలు అంతగా ఉండవు. ఇక నడక, పరుగులు, ఆటలు, బరువులెత్తటం, తొయ్యటం, లాగటం వంటి 'డైనమిక్' భంగిమలు మరో రకం. వీటిలో వెన్నెముక కదలికలు చాలా ఎక్కువగా ఉంటాయి. వెన్ను ఆరోగ్యంగా ఉండేందుకు రెండింటిలోనూ జాగ్రత్తగా ఉండటం అవసరం. బరువులు ఎత్తేప్పుడు, శ్రమతో కూడిన పనులు చేసేటప్పుడు వంగటం, లేవటం వంటివి సరైన విధంగా చెయ్యకపోతే కండరాలు పట్టేయొచ్చు. అలాగే కూర్చోవటం వంటి ఒకే భంగిమలో ఎక్కువసేపు ఉండిపోయినా వెన్నుపై ఒత్తిడి పెరుగుతుంది. ఉదాహరణకు కూచున్నప్పుడు మన నడుము పూసలపై ఏడు రెట్ల అధిక బరువు పడుతుంది. మన వెన్నెముక మొత్తం.. కటి ఎముక మీద నిలబడి ఉంటుంది. ఇది నిటారుగా నిలబడేందుకు రకరకాల కండరాలు, కండర బంధనాలు తోడ్పడుతుంటాయి. మనకు సౌకర్యంగా అనిపించేలా, ఎక్కువసేపు అలాగే ఉన్నా ఇబ్బంది పెట్టని భంగిమలో ఉండటం ముఖ్యం. ఈ మూడూ ఉంటే దాన్ని సరైన భంగిమే అనుకోవచ్చు. ఇవి చేసే పనులను బట్టి, వ్యక్తులను బట్టి మారిపోతుంటాయి.

### వ్యాయామాలే విరుగుడు

నొప్పులు రాకుండా ఉండాలన్నా, మొదలైన నొప్పులు సర్దుకోవాలన్నా నిత్య వ్యాయామాలే కీలకం. నొప్పి వేధిస్తున్నప్పుడు- ఏయే కండరాలు సమస్యకు కారణమవుతున్నాయో గుర్తించి వాటిని బలోపేతం చేసేందుకు వ్యాయామాలు సూచిస్తారు. నొప్పి తీవ్రంగా ఉంటే ముందుగా నొప్పి నివారిణి మాత్రలు, అల్ట్రాసౌండ్ థెరపీ, ట్రాక్షన్, ఐఎఫ్‌టీ వంటి చికిత్సలతో నొప్పి తగ్గేలా చేసి తర్వాత వ్యాయామాలు చేయిస్తారు. సాధారణ వెన్నునొప్పులు చాలా వరకూ ఈ భంగిమలు, వ్యాయామలతోనే పూర్తిగా తగ్గిపోతాయి.



## రూ.16,000 కోట్ల రుణ రికవరీ లక్ష్యం

### పీఎన్‌బీ ఎండీ అశోక్ చంద్ర

**ఢిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో రూ.16,000 కోట్ల మొండి బకాయిలను తిరిగి వసూలు చేయాలన్న (రికవరీ) లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) ఎండీ అశోక్ చంద్ర వెల్లడించారు. లాభదాయకత స్థిరంగా ఉండేందుకు, మొత్తం రుణాల్లో కొత్త మొండి బకాయిలు 1% కంటే తక్కువ ఉండేలా చూసుకోవాలనీ నిర్దేశించుకున్నట్లు వివరించారు. జనవరి-మార్చి త్రైమాసికంలో బ్యాంక్ రూ.4,733 కోట్లను రికవరీ చేసిందని, దీంతో 2024-25 పూర్తి ఆర్థిక సంవత్సరంలో రూ.14,336 కోట్ల రికవరీ సాధ్యమైందని పేర్కొన్నారు. కొత్త మొండి బకాయిల నిష్పత్తి 0.73 శాతానికి పరిమితమైందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కొత్త మొండి బకాయిలు త్రైమాసికంగా రూ.1,500-1,700 కోట్లకు మించకుండా ఉండేలా చూస్తామని వెల్లడించారు. సాంకేతిక రద్దు (రైటాఫ్) ల నుంచీ రూ.6,000 కోట్లు రికవరీ చేస్తామన్నారు. బ్యాంక్ రైటాఫ్‌లు రూ.91,000 కోట్లుగా ఉంటే, ఇందులో 96 శాతానికి కేటాయింపులు చేశామన్నారు. రైటాఫ్ చేసిన ఖాతాల నుంచి రికవరీ లభిస్తే, ఆ మొత్తాన్ని నేరుగా నికర లాభానికి కలుపుతామని తెలిపారు. రూ.25-50 కోట్ల శ్రేణిలో ఉన్న చాలా ఎన్‌పీఏ ఖాతాల నుంచి రికవరీ ఆశిస్తున్నామని వివరించారు. బ్యాంక్ జారీ చేయనున్న మొత్తం రుణాల్లో రిటెయిల్, వ్యవసాయ, ఎంఎస్‌ఎంఈ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తామని.. ఇవే 58% ఉండేలా చూసుకుంటామని అశోక్ వెల్లడించారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి మొత్తం రుణాల్లో ఈ విభాగ వాటా 56 శాతం (రూ.6,02,682 కోట్లు)గా ఉందని తెలిపారు. 2024-25లో దేశంలోని 12 ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) నికర లాభంలో వృద్ధి పరంగా (102%) తొలి స్థానంలో పీఎన్‌బీ నిలిచింది. బ్యాంక్ నికర లాభం 2023-24లో రూ.8,245 కోట్లు కాగా, గత ఆర్థిక సంవత్సరంలో రూ.16,630 కోట్లకు చేరింది. బ్యాంక్ మొత్తం వ్యాపారం 14% పెరిగి రూ.26.83 లక్షల కోట్లకు చేరింది.

## ముంబయి సముద్రతీరంలో కొత్త చమురు-గ్యాస్ క్షేత్రాలు: ఓఎన్‌జీసీ



**ఢిల్లీ:** ముంబయి ఆఫ్‌షోర్ బేసిన్‌లో ఆశాజనకమైన చమురు-గ్యాస్ కొత్త క్షేత్రాలను ప్రభుత్వ రంగ సంస్థ ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) కనుగొంది. సమీప భవిష్యత్తులో దేశీయంగా ఇంధన ఉత్పత్తి పెరగడానికి ఇవి దోహదపడనున్నాయి. ఓపెన్ యాకరేజ్ లైసెన్సింగ్ పాలసీ (ఓఎల్‌ఏపీ) విధానం కింద ఇచ్చిన క్షేత్రాల్లో ఈ నిక్షేపాలను కనుగొన్నట్లు ఓఎన్‌జీసీ వెల్లడించింది. ఓఎల్‌ఏపీ-6 బ్లాక్ ఎంబీ-ఓఎస్‌హెచ్‌పీ- 2020/2, ఓఎల్‌ఏపీ-3 బ్లాక్ ఎంబీ-ఓఎస్‌హెచ్‌పీ- 2018/1 బ్లాకుల్లో కనుగొన్న ఈ క్షేత్రాలకు సూర్యమణి, వజ్రమణిగా పేర్లు పెట్టారు. ఈ రెండూ ఆఫ్‌షోర్ ముంబయి బేసిన్‌లోనే ఉన్నాయి.

జనవరి- మార్చి త్రైమాసికంలో జరిపిన పరీక్షల్లో ఎంబీ-ఓఎస్‌హెచ్‌పీ-2020/2 (సూర్యమణి) బ్లాక్‌లోని ఎంబీఎస్202 హెచ్‌ఏఏ-1 బావిలో రోజుకు 2,235 బ్యారెళ్ల చమురు, 45,181 మిలియన్ క్యూబిక్ మీటర్ల గ్యాస్ వచ్చిందని కంపెనీ తెలిపింది. రెండో జోన్‌లో ఇదే బావిని పరీక్షించగా, రోజుకు 413 బ్యారెళ్ల చమురు, 15,132 మి.క్యూబిక్ మీటర్ల గ్యాస్ వెలుగుచూసింది. ఓఎల్‌ఏపీ-3 బ్లాక్ ఎంబీ - ఓఎస్‌హెచ్‌పీ - 218/1లోని ఎంబీఎస్181హెచ్‌ఎన్‌ఏ-1 బావిలో రోజుకు 2,122 బ్యారెళ్ల చమురు, 83,120 క్యూబిక్ మీటర్ల గ్యాస్‌ను కనుగొన్నారు. దేశంలోనే అతిపెద్ద చమురు-గ్యాస్ క్షేత్రాలు ముంబయి తీరంలో ఉన్నాయి. అరేబియా సముద్రంలో భారత పశ్చిమ తీరానికి 160 కి.మీ దూరంలో ముంబయి హై క్షేత్రం ఉంది. ఈ క్షేత్రం రోజుకు 1,34,000 బ్యారెళ్ల చమురును ఉత్పత్తి చేస్తోంది. దేశీయ చమురు ఉత్పత్తిలో ఇది 35 శాతానికి సమానం. ఇదే క్షేత్రం నుంచి 10 మిలియన్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల గ్యాస్ కూడా వస్తోంది. దేశ గ్యాస్ ఉత్పత్తిలో దీని వాటా దాదాపు 18 శాతం.



## ఢిల్లీని ముంచెత్తిన వాన

### 180కి పైగా విమానాలపై ప్రభావం

**ఢిల్లీ:** దేశరాజధాని ఢిల్లీని భారీ వర్షాలు ముంచెత్తాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షానికి పలు చోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఢిల్లీ కంటోన్మెంట్, ధౌలా కువాన్, సుబ్రోతో పార్క్, నానక్ పురాలు నీటిలో మునిగిపోయాయి. వర్ష ప్రభావంతో ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో 17 అంతర్జాతీయ విమానాలతో సహా 49 విమానాలను దారి మళ్లించారు. 180కి పైగా విమానాల రాకపోకలపై ప్రభావం పడింది. విమానాశ్రయం టెర్మినల్- 1 వద్ద కొంత భాగం పాక్షికంగా దెబ్బతింది. ఓ భాగంలో పైకప్పు నుంచి ఒక్కసారిగా నీరు కారుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

కేరళ అతలాకుతలం.. భారీ వర్షాలు, ఈదురుగాలులు ఆదివారం కేరళలో బీభత్సం సృష్టించాయి. త్రిశ్శూర్ జిల్లాలోని చిరుతుర్తి రైల్వే బ్రిడ్జి సమీపంలో కదులుతున్న రైలుపై చెట్టు విరిగిపడింది. అప్రమత్తమైన లోకోపైలెట్ రైలును నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పిందని అధికారులు తెలిపారు.



## రోజంతా హుషారుగా..

కూల్‌డ్రింక్స్ తాగుతున్నాం అంటే ఒంట్లో చక్కెర నిలవచేసుకుంటున్నాం అన్నమాట. అదెంత హానికరమో తెలుసు కనుక అందుకు బదులుగా హితవు చేసే పానీయాలను అలవాటు చేసుకుందాం. అలాంటివాటిలో బీట్‌రూట్ జ్యూస్ ఒకటి. అందుకోసం.. పసుపు - చిటికెడు, బీట్‌రూట్ - 1, యాపిల్ పండు - సగం, ఉసిరికాయలు - 2, గుడూచి లేదా తిప్ప తీగ (గిలాయ్ స్టిక్) - అంగుళం ముక్క, కొబ్బరి నీళ్లు - కప్పు, అల్లం - ఒకటిన్నర అంగుళం ముక్క, నారింజపండు తొనలు - 6 చొప్పున తీసుకోవాలి. ఎలా చేయాలంటే.. యాపిల్, బీట్‌రూట్‌ల చెక్కు తీసి ముక్కలు కోయాలి. వాటిని మిక్సీజార్‌లో వేసి.. పసుపు, అల్లం, తిప్ప తీగ, గింజలు తీసిన ఉసిరికాయలు, కొబ్బరి నీళు జతచేసి గ్రైండ్ చేయాలి. ఈ పానీయాన్ని వడకట్టి తాగటం వల్ల శరీరానికి అవసరమైన శక్తి కలుగుతుంది. నీరసం, నిసత్తువ ఆవరించవు. బీట్‌రూట్ జ్యూస్ క్రమం తప్పకుండా తాగుతుంటే ఎలాంటి అనారోగ్యాలూ దరిచేరవు.

# కండలు సరే.. కిడ్నీలు భద్రం

శరీర సౌష్ఠవాన్ని, సామర్థ్యాన్ని మెరుగు పరచుకోవాలని ఎవరికి ఉండదు? మంచి బలంతో అందంగా, ఆకర్షణీయంగా కనిపిస్తే కలిగే ఆత్మ విశ్వాసమే వేరు. అందుకే చాలామంది ఇప్పుడు జిమ్‌ల మీద ఆసక్తి చూపుతున్నారు. కసరత్తులతో కండలు పెంచుకోవటానికి ప్రయత్నిస్తున్నారు. కాకపోతే కొందరు.. ముఖ్యంగా యువత కృత్రిమంగా, అసహజ పద్ధతులతో అతి వేగంగా కండలు పొంగించుకోవాలని తాపత్రయ పడటమే చిక్కులు తెచ్చిపెడుతోంది. ప్రొటీన్ పొడులు, ప్రొటీన్ మిల్క్‌షేక్‌లు, క్రియాటిన్, అనబాలిక్ స్టెరాయిడ్లు, నొప్పి మందుల వాడకం పెద్ద నష్టమే కలిగిస్తోంది. రక్తాన్ని శుద్ధి చేసి, శరీరాన్ని పరిశుభ్రంగా ఉంచే కిడ్నీల మీద ఇవి అదనపు భారాన్ని పడేస్తున్నాయి. చివరికి కిడ్నీలు దెబ్బతినే పరిస్థితికీ దారితీస్తుండటం ఆందోళనకరం.



అతడి వయసు 25. ఆరేళ్లుగా జిమ్‌కు వెళ్తున్నాడు. కండలు పెద్దగా పెరగటానికి క్రియాటిన్, ప్రొటీన్ పొడి తీసుకోవాలని అక్కడి ట్రెయినర్ సూచించాడు. నిజమే కాబోలని వాడటం మొదలెట్టాడు. ఒకరోజు కళ్లు తిరగటం, అలసటగా అనిపించింది. పెద్దగా పట్టించుకోలేదు. మళ్లీ మళ్లీ ఇబ్బంది పడుతుండటంతో తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. రక్తంలో క్రియాటినిన్ మోతాదు పెరగటంతో రెండుసార్లు డయాలసిస్ చేయాల్సి వచ్చింది. అదృష్టం కొద్దీ కిడ్నీ పాడవలేదు. కానీ కిడ్నీ నుంచి చిన్న ముక్కను తీసి పరీక్షిస్తే- రక్తాన్ని వడపోసే కిడ్నీల్లోని భాగాలు చాలావరకూ దెబ్బతిన్నట్టు, మూసుకుపోయినట్టు తేలింది. ఒకవేళ ఆసుపత్రికి రావటం కొద్దిరోజులు ఆలస్యమైనట్టయితే కిడ్నీ కోలుకోలేనంతగా దెబ్బతినేదే. అతిగా క్రియాటిన్, ప్రొటీన్ వాడకం వల్ల తలెత్తే అనర్థాలకు ఇదొక ఉదాహరణ. త్వరగా కండరాలను పెంచుకోవాలనే ఆశతో ఇలాంటి అనుచిత పద్ధతులను పాటించే ధోరణి యువతలో ఇటీవల పెరిగిపోతోంది. ఎంతోమంది అనబాలిక్ స్టెరాయిడ్లు, నొప్పి మాత్రలనూ వాడుతున్నారు. ఇవన్నీ కిడ్నీలను దెబ్బతీసే ప్రమాదముండటం గమనార్హం. జిమ్‌లో వ్యాయామాలు చేయటం మంచిదే అయినా జాగ్రత్తగా ఉండటమూ ముఖ్యమేనన్న సంగతి మరవరాదు.

## క్రియాటిన్ కీలక అవయవాలకు చేటు

శరీరంలోని చాలా కండరాల్లో క్రియాటిన్ ఉంటుంది. ఇది పనులు, వ్యాయామం చేస్తున్నప్పుడు కండరాలకు నిరంతరం శక్తి అందిస్తుంది. కండరాలు పుంజుకోవటానికి, త్వరగా కోలుకోవటానికీ తోడ్పడుతుంది. అందుకే జిమ్‌లకు వెళ్లేవారు ఎక్కువసేపు వ్యాయామం చేయటానికి, కండర పుష్టి కోసం పొడులు, మాత్రలు, చాక్లెట్ల రూపంలో అదనంగా వాడుతుంటారు. క్రియాటిన్ పదార్థం ఒక స్థాయి వరకూ పెద్దగా హాని చేయదు. కానీ పెద్దమొత్తంలో తీసుకుంటే మాత్రం మెదడు, కిడ్నీల వంటి కీలక అవయవాల మీద విపరీత ప్రభావం చూపుతుంది. క్రియాటిన్ విచ్ఛిన్నమయ్యే క్రమంలో క్రియాటినిన్ అనే వ్యర్థ పదార్థంగా మారుతుంది.

ఇది రక్తంలో కలిసి కిడ్నీలకు చేరుకుంటుంది. దీన్ని వడగట్టటానికి కిడ్నీలు ఎక్కువ కష్టపడి పనిచేయాల్సి వస్తుంది. దీంతో కిడ్నీలు అలసిపోయి, దెబ్బతినే ప్రమాదముంది. కిడ్నీలు సరిగా వడగట్టకపోతే రక్తంలో క్రియాటినిన్ మోతాదులు పెరుగుతాయి. సాధారణంగా ఇది 0.7 నుంచి 1.2 ఎంజీ/డీఎల్ వరకూ ఉండొచ్చు. అంతకన్నా మించితే కిడ్నీ దెబ్బతింటోందనే అర్థం. పొడులు, చాక్లెట్ల రూపంలో క్రియాటిన్ తీసుకునే కొందరిలో క్రియాటినిన్ మోతాదులు 25 ఎంజీ/డీఎల్ వరకూ ఉంటుండటం.. వీరికి తాత్కాలికంగా డయాలసిస్ చేయాల్సిన అవసరమూ ఏర్పడుతుండటం గమనార్హం.

### ప్రొటీన్ కిడ్నీల మీద అదనపు భారం

జిమ్‌లకు వెళ్లేవారిలో చాలామంది వే ప్రొటీన్‌ను తీసుకోవటం ఎక్కువైంది. ఇదిప్పుడు అన్నిచోట్లా తేలికగా అందుబాటులో ఉంటోంది. ప్రొటీన్ కండరాలు పుంజుకోవటానికి తోడ్పడే మాట నిజమే అయినా అనవసరం గా, అతిగా వాడటం హానికరంగా పరిణమిస్తుంది. సాధారణంగా రోజుకు ఒక కిలో శరీర బరువుకు 0.8 గ్రాముల ప్రొటీన్ అవసరం. జిమ్‌కు వెళ్లేవారు తెలిసో తెలియకో 1.5 నుంచి 2 గ్రాముల వరకూ తీసుకుంటుంటారు. 5 గ్రాముల వరకూ తీసుకునేవారు లేకపోలేదు. ఇది చాలా ప్రమాదకరం. ప్రొటీన్ విచ్ఛిన్నమైనప్పుడు పుట్టుకొ చ్చే యూరిక్ ఆమ్లం వంటి వ్యర్థాలను వడపోయటానికి, బయటకు పంపటానికి కిడ్నీలు ఎక్కువ శ్రమించాల్సి వస్తుంది. అప్పటికే ఊబకాయం గలవారికి, మాంసాహారులకైతే ప్రొటీన్ పొడులు మరింత చేటు చేస్తాయి. కొందరికి తక్కువ బరువుతో పుట్టటం వంటి కారణాలతో చిన్నప్పటి నుంచే కిడ్నీల్లో రక్తాన్ని వడగట్టే భాగాల సంఖ్య తక్కువగా ఉండొచ్చు. దీంతో రక్తం వడపోత ప్రక్రియ కూడా మందగిస్తుంది. కిడ్నీ పనితీరు బాగా తగ్గిపో యేంత వరకూ పైకి ఎలాంటి లక్షణాలూ కనిపించవు. అంతా బాగానే ఉందనుకుంటారు. ఇలాంటివారు తెలిసో తెలియకో అదనంగా ప్రొటీన్ పొడుల వంటివి తీసుకుంటే కిడ్నీల మీద మరింత భారం పెరుగుతుంది. క్రమంగా దెబ్బతినే ప్రమాదముంది. వీరికి మూత్రంలో సుద్ద (అల్బుమిన్) పడుతుంది కూడా. కొన్నిసార్లు ప్రొటీన్ పొడుల్లో భార లోహాలూ ఉండొచ్చు. ఇవీ దీర్ఘకాల కిడ్నీ జబ్బుకు దారితీసే ప్రమాదమూ ఉంది.

## నొప్పి మాత్రలు ఏవైనా నష్టమే

జిమ్‌లకు వెళ్లి కఠినమైన వ్యాయామాలు చేసేవారు తరచూ నొప్పులను తగ్గించే మాత్రలు వేసుకుంటుంటారు. దీంతో మరింత ఎక్కువగా వ్యాయామాలు చేస్తుంటారు. అసలు విషయం ఏంటంటే- నొప్పి మందులేవైనా ౣకిడ్నీలకు చేటు చేయటం. ట్రెమడాల్ వంటి కొన్ని సురక్షితమైన మందులున్నప్పటికీ ఇవి గుండె సమస్యలకు దారితీయొచ్చు. కొందరికి వీటితో వెంటనే వాంతులవుతుంటాయి కూడా. డైక్లోఫెనాక్, ఐబూప్రొఫెన్ వంటి ఎన్ఎస్ఏఐడీ రకం నొప్పి మందులను చీటికీ మాటికీ వేసుకుంటే కిడ్నీలు దెబ్బతినొచ్చు. ఇవి కిడ్నీలకు రక్త సరఫరా తగ్గేలా చేయటం ద్వారా వడపోత ప్రక్రియను అస్తవ్యస్తం చేస్తాయి. రక్తంలో సోడియం, నీరు పేరుకునేలా చేస్తాయి కూడా. అందుకే నొప్పి మాత్రలు వేసుకోగానే ఉబ్బినట్టుగా కనిపిస్తారు. కొందరు దీన్ని బరువు పెరిగినట్టుగానూ పొరపడుతుంటారు.

## అనబాలిక్ స్టెరాయిడ్లు రక్తనాళాలకు దెబ్బ

స్టెరాయిడ్లు ఒక్క కండరాలు పెరగటానికే కాదు, రకరకాల పనుల్లో పాలు పంచుకుంటాయి. చాలా జబ్బుల చికిత్సల్లో స్టెరాయిడ్లు వాడుతుంటారు. వీటిల్లో ఒకరకం అనబాలిక్ స్టెరాయిడ్లు. ఇవి కండరాలు, బరువు, రక్త పరిమాణం పెంచటం వంటి మంచి పనులూ చేస్తాయి. అలాగని దీర్ఘకాలంగా, అనవసరంగా వాడితే రక్తనాళాల లోపలి పైపొర దెబ్బతింటుంది. దీంతో రక్తపోటు పెరగటం, కిడ్నీలు దెబ్బతినటం వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. కిడ్నీలను లోపలి నుంచి చూస్తే రక్త గుచ్ఛం మాదిరిగా ఉంటాయి. అందువల్ల రక్తనాళాలను ప్రభావితం చేసే, దెబ్బతీసే ఏ జబ్బయినా వడపోత సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. అనబాలిక్ స్టెరాయిడ్లతో గుండె కండరం మెత్తగా, బలహీనంగా అవటం మరో సమస్య. దీంతో గుండె రక్తాన్ని సరిగా పంప్ చేయలేదు. ఫలితంగా కిడ్నీల్లో వడపోత ప్రక్రియ కూడా మందగిస్తుంది. స్టెరాయిడ్లు రక్తంలో సోడియం, నీటి మోతాదు పెరిగేలా చేస్తాయి కూడా. దీంతో ఒళ్లంతా ఉబ్బినట్టు అవుతుంది. దీన్ని కొందరు బలంగానూ భావిస్తుంటారు. బరువు పెరిగామని అనుకుంటుంటారు. ఇది నిజం కాదు. కిడ్నీలు, గుండె పనితీరు మందగించటమే కారణమని తెలుసుకోవాలి.

### ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

వీలైనంతవరకూ ఆహారం ద్వారానే నాణ్యమైన ప్రొటీన్ లభించేలా చూసుకోవాలి. మాంసాహారంతో లభించే ప్రొటీన్‌తోనే కండలు పెరుగుతాయని అనుకోవటం అపోహ. శాకాహార ప్రొటీన్ కూడా కండర పుష్టికి తోడ్పడుతుంది. చిక్కుడు జాతి కూరగాయలు, పప్పులు, పాలు, పెరుగు వంటి వాటితో ప్రొటీన్ బాగా లభిస్తుంది. నిజానికి వే ప్రొటీన్ పొడి పన్నీరు తయారీలో మిగిలిన ద్రవం నుంచే తయారు చేస్తారు.

క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. కండర పుష్టికి ఇదే కీలకం. కానీ ఏవేవో పొడులు, మాత్రలు తీసుకుంటేనే కండలు పెరుగుతాయని అనుకోవద్దు. వీటితో కండ వృద్ధి చెందినా అది తాత్కాలికమేనని తెలుసుకోవాలి.

- ప్రొటీన్ పొడులు, అనబాలిక్ స్టెరాయిడ్ల వంటివి తప్పనిసరిగా వాడాల్సిన పరిస్థితుల్లో విధిగా డాక్టర్‌ను సంప్రదించి నిర్ణయం తీసుకోవాలి. తగు పరీక్షలు చేయించుకొని, శారీరకంగా బలంగా ఉన్నట్టు తేలితే వీటిని వాడుకోవచ్చు.
- శరీర సామర్థ్యాన్ని గమనించకుండా ఒక స్థాయిని మించి, గంటల తరబడీ వ్యాయామం చేయటం మంచిది కాదు. హఠాత్తుగా గుండెపోటు రావటానికి ఇదీ ఒక కారణమేనని గుర్తించాలి.
- బాగా ఎండగా, వేడిగా ఉన్న చోట్ల వ్యాయామాలు చేయొద్దు.
- వ్యాయామాలు చేస్తున్నప్పుడు మధ్యమధ్యలో నీళ్లు కూడా తాగాలి. కేవలం ప్రొటీన్ మిల్క్ షేక్స్‌తోనే శక్తి లభిస్తుందని అనుకోవద్దు. నీటితో లభించే శక్తి, ఉత్సాహం మరే పానీయంతోనూ రాదు.
- పొటాషియం లోపం గలవారు అరటి, ఖర్జూరం వంటి పండ్లు తినటం మంచిది.

### ఇవీ ప్రమాద హెచ్చరికలు

- కళ్లు తిప్పినట్టు, తల తేలిపోతున్నట్టు అనిపించటం.
- త్వరగా అలసిపోవటం, నిస్సత్తువ, నీరసం.
- మూత్రం అంతగా రాకపోవటం.
- పాదాలు, చీలమండలు, ముఖం, చేతులు ఉబ్బటం.
- రాత్రిపూట తరచూ మూత్రానికి వెళ్లాల్సి రావటం.
- ఇలాంటి లక్షణాలు కనిపిస్తే ఏమాత్రం అశ్రద్ధ చేయరాదు.

### వీరు వాడొద్దు

- మధుమేహం, అధిక రక్తపోటు సమస్యలు గలవారు.
- నెలలు నిండక ముందే పుట్టినవారు, పుట్టుకతో తక్కువ బరువుతో ఉన్నవారు.
- పొగ తాగే అలవాటు గలవారు.
- ఊబకాయం గలవారు.

# తరచూ బిర్యానీని తింటున్నారా..?

## అయితే రోగాలకు స్వాగతం పలుకుతున్నట్లే..!

ప్రస్తుతం దేశంలో ఏ మారుమూల ప్రాంతానికి వెళ్లినా సరే ప్రజలు నాన్ వెజ్ రుచులను విడిచిపెట్టకుండా తింటున్నారు. ఇన్ స్టాగ్రామ్ లో రీల్స్ లేదా యూట్యూబ్‌లో షార్ట్స్‌ను చూస్తున్న నెటిజన్లు వాటిల్లో వచ్చే ఫుడ్ వీడియోలను చూసి మైమరిచిపోతున్నారు. ఆ ఫుడ్స్‌ను తినేందుకు ఆసక్తిని చూపిస్తున్నారు. ఈ క్రమంలోనే చాలా వరకు రెస్టారెంట్లలో అనేక నాన్ వెజ్ వెరైటీలతోపాటు బిర్యానీ వెరైటీలు కూడా లభిస్తున్నాయి. అయితే ఘుమ ఘుమలాడే బిర్యానీని తినడం వరకు బాగానే ఉంటుంది. కానీ దాని రుచికి దాసోహం అయిపోయి బానిసగా మారితేనే కష్టం. ఎందుకంటే ఎప్పుడో ఒకసారి జిహ్వా చాపల్యం తీర్చుకునేందుకు బిర్యానీని టేస్ట్ చేయవచ్చు. కానీ తరచూ బిర్యానీని తింటే అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. బిర్యానీని తరచూ తినడం మంచిది కాదని వారు సూచిస్తున్నారు.



### అధికంగా క్యాలరీలు..

బిర్యానీలో అధికంగా క్యాలరీలు ఉంటాయి. ఏ రకానికి చెందిన బిర్యానీ అయినా సరే కొంచెం అటు ఇటుగా క్యాలరీలు మాత్రం అధికంగానే ఉంటాయి. బిర్యానీ తయారీలో బియ్యం, మాంసం, నెయ్యి, అధికంగా నూనె, జీడిపప్పు వంటి వాటిని వాడుతారు. ఇవన్నీ అధికంగా క్యాలరీలను కలిగి ఉండే ఆహారాలే. కనుక బిర్యానీని తరచూ తింటే మన శరీరంలో పెద్ద ఎత్తున క్యాలరీలు చేరుతాయి. ఇవి కొవ్వుగా మారుతాయి. ఈ క్రమంలో తరచూ బిర్యానీని తింటే అధికంగా బరువు పెరిగిపోతారు. వ్యాయామం లేదా శారీరక శ్రమ చేస్తే ఓకే. లేదంటే తరచూ బిర్యానీని తింటే స్థూలకాయం వస్తుంది. ఇది టైప్ 2 డయాబెటిస్, గుండె జబ్బులు, లివర్ వ్యాధులకు కారణం అవుతుంది.

### గుండె జబ్బులు వచ్చే ప్రమాదం..

బిర్యానీలో కొవ్వులు అధికంగా ఉంటాయి. బిర్యానీలో అనారోగ్యకరమైన ట్రాన్స్ ఫ్యాట్స్ అధికంగా ఉంటాయి. వండే వారు నాణ్యత లేని నెయ్యి లేదా పామాయిల్ వంటి వాటిని వాడితే అలాంటి బిర్యానీలో కొవ్వులు ఇంకా అధికంగా ఉంటాయి. ఇవి మన శరీరంలో చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్)ను పెంచుతాయి. మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్)ను తగ్గిస్తాయి. దీంతో గుండె జబ్బులు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. రక్త నాళాల్లో కొవ్వు చేరుతుంది. ఇది హార్ట్ ఎటాక్‌లకు కారణం అవుతుంది. బిర్యానీలో ఉప్పు అధికంగా ఉంటుంది. ఇందులో సోడియం ఉంటుంది కనుక బిర్యానీని తరచూ తింటే మన శరీరంలో సోడియం స్థాయిలు సైతం పెరుగుతాయి. దీంతో బీపీ పెరుగుతుంది. ఇది హార్ట్ స్ట్రోక్‌లకు కారణం అవుతుంది. అలాగే కిడ్నీలపై భారం పడుతుంది. దీర్ఘకాలంలో కిడ్నీలు చెడిపోయే ప్రమాదం ఉంటుంది.

### జీర్ణ వ్యవస్థకు చేటు..

బిర్యానీని అధికంగా తినడం వల్ల జీర్ణ వ్యవస్థ పనితీరు మందగిస్తుంది. అజీర్తి ఏర్పడుతుంది. కడుపు ఉబ్బరం, అసిడిటీ, గుండెలలో మంట, మలబద్ధకం వంటి జీర్ణ సమస్యలు వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయి. అలాగే బిర్యానీలో ఉండే మసాలాల కారణంగా కొందరికి పొట్టలో తీవ్ర అసౌకర్యం ఏర్పడుతుంది. ఇది విరేచనాలను కూడా కలిగిస్తుంది. బిర్యానీని తరచూ అధికంగా తినడం వల్ల జీవన శైలి సంబంధ వ్యాధులు వచ్చే ప్రమాదం పెరుగుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా టైప్ 2 డయాబెటిస్‌తోపాటు గుండె జబ్బులు, అధిక కొలెస్ట్రాల్, ఫ్యాటీ లివర్ వ్యాధి వచ్చే ప్రమాదం పెరుగుతుందని అంటున్నారు. బిర్యానీని తింటే కొందరికి పోషకాలు సరిగ్గా లభించవు. దీంతో పోషకాహార లోపం ఏర్పడే అవకాశం కూడా ఉంటుంది. కనుక బిర్యానీని తరచూ తినకూడదని, ఎప్పుడో ఒకసారి అయితే ఫర్వాలేదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

## ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంల భేటీలో
# రెండు తీర్మానాలు చేశాం: పవన్ కల్యాణ్



**ఢిల్లీ:** ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంల సమావేశంలో ప్రధానంగా రెండు తీర్మానాలు చేసినట్లు ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఢిల్లీలో ఈ భేటీ ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ విజయంపై ఒక తీర్మానం చేయగా.. దేశ వ్యాప్తంగా కేంద్రం చేపట్టబోయే కుల జనగణన చేపట్టాలన్న నిర్ణయానికి మద్దతు పలుకుతూ మరో తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రతి ఒక్కరూ ఆపరేషన్ సిందూర్ విజయం పట్ల సాయుధ బలగాలకు, ప్రధాని నరేంద్ర మోదీకి అభినందనలు తెలిపినట్లు మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందే వెల్లడించారు. మహారాష్ట్రలో తీసుకొచ్చిన అనేక పాలనా సంస్కరణలను ప్రధాని మోదీ ప్రశంసించారన్నారు. పహల్గాం ఘటన అనంతరం భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తర్వాత భాజపా పాలిత రాష్ట్రాలతో ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి భేటీ అయ్యారు. ఈ భేటీలో ఆపరేషన్ సిందూర్‌కి సంబంధించిన వివరానలు వారికి కేంద్రమంత్రులు వివరించారు.



## తాజ్‌మహల్‌లో యాంటీ-డ్రోన్ వ్యవస్థ

**న్యూఢిల్లీ :** ప్రపంచంలోనే అద్భుత కట్టడాల్లో ఒకటైన తాజ్‌మహల్‌కు ముప్పు తలపెడుతామంటూ ఇటీవల బెదిరింపులు వస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కీలక చర్యలకు ఉపక్రమించింది. గగనతల ముప్పులను దీటుగా ఎదుర్కొనేందుకు అత్యంత అధునాతన యాంటీ-డ్రోన్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. "తాజ్ మహల్ కాంప్లెక్స్‌లో యాంటీ డ్రోన్ వ్యవస్థను ఏర్పాటు చేస్తాం. దీనికి 7 నుంచి 8 కి.మీ పరిధిలో పనిచేసే సామర్థ్యం ఉంది. అయితే, ప్రస్తుతానికి ప్రధాన గోపురం నుంచి 200 మీటర్ల పరిధిలోనే ఇది ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఈ ప్రాంతంలోకి ఏదైనా డ్రోన్ ప్రవేశిస్తే.. దాని సిగ్నల్స్‌ను ఆటోమేటిక్‌గా ఇది గుర్తించి జామ్ చేస్తుంది. తద్వారా దాన్ని పని చేయకుండా చేస్తుంది. దీనిని 'సాఫ్ట్ కిల్'గా చెబుతుంటాం" అని తాజ్‌మహల్ సెక్యూరిటీని పర్యవేక్షించే ఏసీపీ సయ్యద్ ఆరిబ్ అహ్మద్ వెల్లడించారు. ఈ యాంటీ డ్రోన్ వ్యవస్థకు సంబంధించి పోలీసు సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామని, త్వరలోనే దీనికోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. మరికొన్ని రోజుల్లోనే తాజ్‌లో ఈ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. ప్రపంచ వారసత్వ కట్టడాల్లో ఒకటిగా నిలిచిన తాజ్‌మహల్‌ను నిత్యం వేలాది మంది సందర్శిస్తుంటారు. ఇక్కడి భద్రతను ప్రస్తుతం సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్, యూపీ పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. వీరికి అదనంగా అత్యంత అధునాతన డ్రోన్ నిర్వీర్య వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించిన అధికారులు.. ఇందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదిలాఉంటే, ఇటీవల భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌లోని ఉగ్ర, సైనిక స్థావరాలపై భారత సైన్యం కచ్చితమైన దాడులు నిర్వహించిన సంగతి తెలిసిందే. అనంతరం పాకిస్థాన్ కూడా భారత్‌పై డ్రోన్లు, క్షిపణులతో దాడులకు తెగబడింది. అయితే, వీటిని యాంటీ డ్రోన్ వ్యవస్థల సాయంతో భారత దళాలు దీటుగా తిప్పికొట్టాయి. ఇలా శత్రు దాడుల నేపథ్యంలో దేశంలోని కీలక స్థావరాల వద్ద ఈ తరహా చర్యలు అనివార్యంగా మారుతోంది.



## యూనస్.. బంగ్లాదేశ్‌ను అమెరికాకు
# అమ్మేస్తున్నారు : షేక్ హసీనా

బంగ్లాదేశ్ ప్రభుత్వ తాత్కాలిక సారథి ముహమ్మద్ యూనస్‌పై ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బంగ్లా అవామీ లీగ్ పార్టీపై నిషేధం విధించడాన్ని తీవ్రంగా ఖండించిన ఆమె.. అది రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఉగ్రవాద సంస్థల సాయంతో పాలనను కొనసాగిస్తున్నారని విమర్శించారు. ఈ క్రమంలో బంగ్లాను అమెరికాకు అమ్మేసేందుకు కుట్ర జరుగుతుందని పేర్కొంటూ ఓ ఆడియోను విడుదల చేశారు. "సెయింట్ మార్టిన్ ద్వీపం కోసం అమెరికా చేసిన డిమాండ్లకు మా నాన్న (షేక్ ముజిబుర్ రహ్మాన్) అంగీకరించలేదు. అందుకు ఆయన ప్రాణాలను కూడా అర్పించాల్సి వచ్చింది. అధికారంలో ఉండేందుకు దేశాన్ని విక్రయించాలని నేను ఎప్పుడూ భావించలేదు కాబట్టే నా దుస్థితి ఇలా నెలకొంది. దేశంలోని ఒక్క అంగుళం భూభాగాన్ని ఎవ్వరూ వదులుకోరు. కానీ, ఈ రోజు ఏమిటీ దౌర్భాగ్యం. దేశంతో పాటు ప్రపంచం మెచ్చిన వ్యక్తికి.. అధికారాన్ని చేపట్టిన తర్వాత ఏమయ్యింది?" అని ప్రస్తుత సారథి యూనస్‌ను ఉద్దేశిస్తూ షేక్ హసీనా ప్రశ్నించారు. ఉగ్రవాద భావజాలమున్న వారి మద్దతుతో యూనస్ ప్రభుత్వాన్ని చేపట్టారని షేక్ హసీనా ఆరోపించారు. "నా ప్రభుత్వం పోరాటం చేసిన వారితో, అంతర్జాతీయంగా నిషేధానికి గురైన వారితో కలిసి ప్రభుత్వాన్ని చేజిక్కించుకున్నారు. ఒక్క ఉగ్రదాడి జరిగితేనే మేం కఠిన చర్యలు తీసుకున్నాం. ఎంతో మందిని అరెస్టు చేశాం. కానీ, ఇప్పుడు జైళ్లన్నీ ఖాళీగా ఉన్నాయి. అందర్నీ విడిచిపెడుతున్నారు. బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం మిలిటెంట్ల రాజ్యం నడుస్తోంది" అని మాజీ ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్ అవామీ లీగ్‌పై నిషేధం విధించడాన్ని షేక్ హసీనా తీవ్రంగా తప్పుపట్టారు. అది అక్రమమని, చట్టవిరుద్ధమన్నారు. "సుదీర్ఘ పోరాటం చేసి దేశాన్ని సాధించుకున్నాం. రాజ్యాంగాన్ని మార్చే అధికారం ఆయనకు ఎవరిచ్చారు? ఆయనకు ప్రజా మద్దతు లేదు. ఆ పదవి కూడా ఉనికిలో లేదు. పార్లమెంటు నిర్ణయం లేకుండా చట్టాన్ని ఎలా మారుస్తారు? బంగ్లాదేశ్ అవామీ లీగ్‌ను నిషేధించడం చట్టవిరుద్ధం" అని మాజీ ప్రధాని మండిపడ్డారు.

## ఉక్రెయిన్ నగరాలపై.. 367 డ్రోన్లు,
# క్షిపణులతో రష్యా దాడి



ఉక్రెయిన్-రష్యాల మధ్య ఓవైపు యుద్ధ ఖైదీల మార్పిడి జరుగుతున్నప్పటికీ ఇరుదేశాల మధ్య దాడులు మాత్రం ఆగడం లేదు. ఆదివారం వందలాది మంది సైనికులు, పౌరులను విడిచిపెట్టిన రష్యా.. ఉక్రెయిన్‌పై భీకర దాడులకు తెగబడింది. దాదాపు 367 డ్రోన్లు, క్షిపణులతో దాడులు చేయగా.. వీటిల్లో 12 మంది మృతిచెందారు. మూడేళ్ల యుద్ధంలో ఒకేసారి ఈ స్థాయిలో డ్రోన్లు, క్షిపణులతో దాడులు చేయడం ఇదేతొలిసారి అని ఉక్రెయిన్ సైనిక వర్గాలు వెల్లడించాయి. యుద్ధ ఖైదీల అప్పగింతలో భాగంగా శుక్రవారం ఇరుపక్షాలు 390 మంది చొప్పున మార్పిడి చేసుకోగా శనివారం 307 మందిని ఇరుదేశాలు మార్పిడి చేసుకున్నాయి. తాజాగా మరో 303 సైనికులను పరస్పరం అప్పగించుకున్నట్లు రష్యా రక్షణశాఖ వెల్లడించింది. ఈ ప్రకటన రాకముందు కీవ్‌తోపాటు ఇతర ప్రాంతాలపై మాస్కో భీకర దాడులు చేసింది. ఒకేరోజు 69 క్షిపణులతో పాటు 298 డ్రోన్లలో విరుచుకుపడింది. వీటిలో ఇరాన్ రూపొందించి షాహెద్ డ్రోన్లు కూడా ఉన్నట్లు సమాచారం. మొత్తంగా ఈ దాడుల్లో 12 మంది చనిపోగా.. అనేకమంది గాయాలపాలయ్యారు. ఉక్రెయిన్‌లోని 30 నగరాలు, గ్రామాలపై ఉద్దేశపూర్వక దాడులు జరిగాయని అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రష్యాపై ఆంక్షలు విధించాలని పాశ్చాత్య దేశాలను అభ్యర్థించారు. రష్యా నాయకత్వంపై బలమైన ఒత్తిడి తీసుకువస్తే తప్పితే ఈ దారుణాలకు అడ్డుకట్ట వేయలేమన్నారు.

# మాకు ఆ విద్యార్థుల వివరాలు కావాలి

.. హార్వర్డ్ పై ట్రంప్ పోస్టు



హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో మొత్తం 31 శాతం మంది విదేశీ విద్యార్థులు ఉన్నారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థుల పేర్లు, దేశాల వివరాలు తమకు అందజేయాలని కోరారు. ఇటీవల హార్వర్డ్‌లో విదేశీ విద్యార్థులను చేర్చుకోవడానికి ఉన్న అనుమతిని రద్దు చేస్తూ ట్రంప్ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. దీన్ని అక్కడి ఫెడరల్ న్యాయమూర్తి అడ్డుకున్నారు. ఈ క్రమంలోనే ట్రంప్ తన నిర్ణయాన్ని సమర్థించుకుంటూ ఆదివారం ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. 'మొత్తం 31శాతం మంది విదేశీ విద్యార్థులున్నారనే విషయాన్ని హార్వర్డ్ ఎందుకు చెప్పడం లేదు. వారిలో అమెరికా వ్యతిరేక దేశాల నుంచి వచ్చిన వాళ్లూ ఉన్నారు. ఆయా దేశాలు వారి విద్యార్థుల చదువు కోసం ఎలాంటి సొమ్ము చెల్లించడం లేదు. ఆ విదేశీ విద్యార్థుల వివరాలు తెలుసుకోవాలనుకుంటున్నాం. హార్వర్డ్ యూనివర్సిటీకి మేము బిలియన్ డాలర్లు చెల్లించాం. వారి వివరాలు తెలుసుకోవాలనే మా అభ్యర్థన సరైనదే. మాకు ఆ విద్యార్థుల పేర్లు, దేశాల వివరాలు కావాలి. మీ దగ్గర రూ.442 కోట్లు ఉన్నాయిగా.. వాటినే ఉపయోగించుకోండి. డబ్బు కోసం ఫెడరల్ ప్రభుత్వానికి ఎలాంటి విజ్ఞప్తులు చేయకండి' అని ట్రంప్ రాసుకొచ్చారు. ఇటీవల హార్వర్డ్ యూనివర్సిటీకి అందించే నిధుల్లో ట్రంప్ కోత విధించిన సంగతి తేలిసిందే. ఈ క్రమంలోనే గురువారం ఏకంగా విదేశీ విద్యార్థులను చేర్చుకోవడానికి ఉన్న అనుమతిని రద్దు చేసింది. దీన్ని వ్యతిరేకిస్తూ యూనివర్సిటీ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ట్రంప్ చర్య అనైతికమని. నిబంధనలు ఉల్లంఘించడం అవుతుందని హార్వర్డ్ పేర్కొంది. "ఒక్క సంతకంతో యూనివర్సిటీలోని మొత్తం విద్యార్థుల్లో పావువంతు మందిని తొలగించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది" అని వెల్లడించింది. దీనిపై విచారణ జరిపిన ఫెడరల్ కోర్టు న్యాయమూర్తి.. ట్రంప్ నిర్ణయాన్ని నిలుపుదల చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

# నకిలీ వీసా రాకెట్ గుట్టురట్టు..
## అమెరికాలో ఇద్దరు పాకిస్థానీయుల అరెస్టు



అమెరికాలో నకిలీ ధ్రువీకరణ పత్రాలు, ఉద్యోగాలు సృష్టించి.. వాటిని చూపించి అక్రమంగా వీసాలు పొందుతున్న కేటుగాళ్ల గుట్టురట్టయింది. ఇలా అక్రమంగా పొందిన వీసాలను విదేశీయులకు విక్రయించి డబ్బు సంపాదిస్తున్న ఇద్దరు పాకిస్థాన్ జాతీయులను అమెరికా ఎఫ్‌బీఐ అధికారులు అదుపులోకి తీసుకొన్నారు. ఈ విషయాన్ని ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాశ్ పటేల్ వివరించారు. టెక్సాస్‌లోని పాకిస్థాన్‌కు చెందిన అబ్దుల్ హది, ముర్షిద్ (39), మహమ్మద్ సల్మాన్ (35)లను ఎఫ్‌బీఐ అధికారులు అరెస్టు చేశారు. వీరు ఉద్యోగాలు సృష్టించినట్లు నకిలీ పత్రాలు సమర్పించి అక్రమంగా వీసాలు పొంది.. వాటిని విదేశీయులకు పెద్ద మొత్తంలో అమ్ముకునే వారు. ఇందుకు ఈబీ-2, ఈబీ-3, హెచ్1బీ వీసా ప్రోగ్రామ్‌లను ఉపయోగించేవారు. అమెరికన్లకే ఉద్యోగాలు ఇస్తున్నట్లు.. లేబర్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన అన్ని నిబంధనలు పాటిస్తున్నట్లున్న నకిలీ ఉద్యోగ ప్రకటనలను పత్రికల్లో పబ్లిష్ చేయించారు. ఒక్కసారి అక్కడి నుంచి అనుమతులు వచ్చిన తర్వాత.. వారు వీసా కోరుకుంటున్న వారి కోసం గ్రీన్‌కార్డులను మంజూరు చేయాలని అమెరికా ఇమ్మిగ్రేషన్ విభాగాన్ని అభ్యర్థిస్తారు.

### ట్రంప్ పేరుతో స్కామ్..!

వీరి గుట్టు కాస్త బయట పడటంతో ఎఫ్‌బీఐ అధికారులకు చిక్కారు. విచారణలో ముర్షిద్ చట్టవిరుద్ధంగా అమెరికా పౌరసత్వం పొందేందుకు యత్నించినట్లు తేలింది. వీరు కొన్ని సంవత్సరాల నుంచి ఈ కార్యకలాపాలు సాగిస్తున్నారని ఎఫ్‌బీఐ డల్లాస్ స్పెషల్ ఏజెంట్ ఒకరు పేర్కొన్నారు. జాతీయ భద్రతను కాపాడటానికి, ఇమిగ్రేషన్‌కు బలమైన చట్టాలు అవసరమని ఆయన నొక్కి చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా.. కస్టడీకి ఇవ్వాలని అధికారులు కోరారు. దీనిపై ఈ నెల 30న తదుపరి విచారణ జరగనుంది. వీరు దోషులుగా తేలితే.. దాదాపు 20 ఏళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## జపాన్‌ను అధిగమించి..
# నాలుగో ఆర్థిక శక్తిగా భారత్
## : నీతి ఆయోగ్ సీఈఓ

ప్రపంచంలో జపాన్‌ను అధిగమించి భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం వెల్లడించారు. దేశ స్థూల దేశీయోత్పత్తి 4 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవడంతో అమెరికా, చైనా, జర్మనీ తర్వాత స్థానంలో నిలిచిందన్నారు. పదో నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ అస్థిరత, సవాళ్ల నేపథ్యంలో భారత ఆర్థిక వ్యవస్థ స్థిరంగా కొనసాగుతూ ఒక మార్గదర్శిగా నిలుస్తోందని పేర్కొన్నారు. పెట్టుబడులకు గమ్యస్థానంగా దేశం ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తుండటంతో ఈ ఘనత సాధ్యమైందన్నారు. దేశ ఆర్థిక వృద్ధిని తెలియజేసే ఐఎంఎఫ్ అంచనాలను ఉటంకిస్తూ..అమెరికా, చైనా, జర్మనీ మాత్రమే ప్రపంచ ఆర్థిక ర్యాంకింగ్స్‌లో మనకంటే ముందు ఉన్నాయని అన్నారు. ఇదే విధంగా మనం ముందుకు సాగితే మరో మూడేళ్లలో జర్మనీని దాటుకొని.. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని పేర్కొన్నారు. ఇందుకోసం మూలధన వ్యయాల పెంపు, సులభతర వ్యాపార నిర్వహణ, వ్యాపార నిర్వహణ ఖర్చులు తగ్గడం, కార్మికులతో తయారీకి ప్రాధాన్యం, ప్రపంచ మార్కెట్‌పై దృష్టి సారించడం వంటి చర్యలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రస్తుతం వృద్ధి చెందుతున్న దేశీయ డిజిటల్ మార్కెట్.. రాబోయే దశాబ్ద కాలంలో భారత చాలా కీలకమన్నారు. మరోవైపు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఇదే విషయాన్ని 'ఎక్స్' వేదికగా తెలిపారు. వికసిత్ భారత్ వైపు ఇది అతిపెద్ద అడుగు అని పేర్కొన్నారు. దీన్ని సాకారం చేసిన ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. కొన్నేళ్లలోనే భారత్ మూడో ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



## మానవ శరీర భాగాలు
# బ్లాక్ మార్కెట్‌లో విక్రయం..
## 'హార్వర్డ్' మాజీ ఉద్యోగి నిర్వాకం

హార్వర్డ్ యూనివర్సిటీ వైద్య విభాగానికి దానంగా ఇచ్చిన మృతదేహాల నుంచి శరీర భాగాలను మాయం చేసిన కేసులో విశ్వవిద్యాలయానికి చెందిన మాజీ ఉద్యోగిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హార్వర్డ్ మెడికల్ స్కూల్ మార్చురీలో మాజీ మేనేజర్‌గా విధులు నిర్వహించిన 57 ఏళ్ల సెడ్రిక్ లాడ్జ్ అనే వ్యక్తి వ్యక్తి మృతదేహాల నుంచి అవయవాలను వేరు చేసి బ్లాక్ మార్కెట్‌లో అమ్మినట్లు అధికారులు పేర్కొన్నారు. పీపుల్ మ్యాగజైన్ చేసిన ఆరోపణల ప్రకారం.. హార్వర్డ్ మెడికల్ స్కూల్ మార్చురీలో మాజీ మేనేజర్‌గా విధులు నిర్వహించిన 57 ఏళ్ల సెడ్రిక్ లాడ్జ్‌కు పెన్సిల్వేనియాలోని ఒక వ్యక్తి మూడేళ్లలో దాదాపు 37,355.16 బిలియన్ డాలర్లను ఫోన్‌పే ద్వారా చెల్లించాడు. చెల్లింపుల సమయంలో "హెడ్ నంబర్ 7" వంటి అనుమానాస్పద పదాలు ఉన్నట్లు గుర్తించారు. మసాచుసెట్స్‌లోని ఒక మహిళకు మానవ చర్మాన్ని సరఫరా చేసినట్లు అతడిపై ఆరోపణలు ఉన్నాయి. దీంతో గతేడాది పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. తాజాగా పెన్సిల్వేనియాలోని ఒక ఫెడరల్ కోర్టులో విచారణ సందర్భంగా అతడు నేరాన్ని అంగీకరించినట్లు అధికారులు పేర్కొన్నారు. 2018-2020 మధ్య వైద్య పరిశోధన కోసం హార్వర్డ్ అనాటమికల్ గిఫ్ట్ ప్రోగ్రామ్‌కు విరాళంగా ఇచ్చిన మార్చురీలోని శవాల నుంచి శరీర భాగాలను దొంగలించి.. వాటిని డార్క్ వెబ్‌సైట్లలో అంతర్రాష్ట్ర రవాణా చేసినట్లు సెడ్రిక్ లాడ్జ్ తెలిపాడు. బోస్టన్‌లోని హార్వర్డ్ మార్చురీ నుంచి దొంగలించిన శరీర భాగాలను సెడ్రిక్ లాడ్జ్ న్యూ హాంప్‌షైర్‌లోని తన ఇంటికి తీసుకెళ్లి భద్రపరిచేవాడినని.. అనంతరం వాటిని తన భార్య సహకారంతో రాష్ట్రాల సరిహద్దుల మీదుగా బ్లాక్ మార్కెట్‌లో విక్రయించేవాడినని వెల్లడించాడు. ఒక్కోసారి కొనుగోలుదారులు నేరుగా అతడి నివాసానికి వచ్చి అవయవాలను తీసుకెళ్లేవారని చెప్పాడు. వైద్య విద్యార్థుల పరిశోధనలకు ఉపయోగపడాలని సేవాభావంతో దానం చేసిన మృతదేహాల



## భారత్‌ను.. అస్తిత్వ ముప్పుగా
# చూస్తోన్న పాకిస్థాన్

పాకిస్థాన్‌కు సైనిక, ఆర్థికపరంగా చైనా నుంచి పూర్తి మద్దతు లభిస్తోన్న విషయం తెలిసిందే. అయితే, భారత్‌ను ఓ అస్తిత్వ ముప్పుగానే భావిస్తున్న దాయాది దేశం.. తన అణ్వాయుధాగారాన్ని ఆధునీకరించుకుంటున్నట్టు తాజా నివేదిక వెల్లడించింది. 'వరల్డ్‌వైడ్ థ్రెట్ అసెస్‌మెంట్' పేరుతో అమెరికా రక్షణ నిఘా సంస్థ విడుదల చేసిన జాబితాలో ఈ విషయాన్ని వెల్లడించింది. "భారత్‌ను పాకిస్థాన్ అస్తిత్వ ముప్పుగా పరిగణిస్తోంది. భారత సైనిక శక్తిని దృష్టిలో ఉంచుకొని.. అణ్వాయుధాల అభివృద్ధి సహా సైనిక ఆధునీకరణ ప్రయత్నాలు కొనసాగిస్తోంది. ఈ క్రమంలో తన అణు ఆయుధాగారాన్ని ఆధునీకరిస్తోంది. అణు పదార్థాల భద్రత, న్యూక్లియర్ కమాండ్ అండ్ కంట్రోల్ నిర్వహణతోపాటు భారీ విధ్వంసాలను సృష్టించే పదార్థాలను విదేశీ సరఫరాదారులు, మధ్యవర్తుల నుంచి సేకరిస్తోంది" అని తాజా నివేదిక వెల్లడించింది. ఈ భారీ విధ్వంసం సృష్టించే ఆయుధాల అభివృద్ధికి అవసరమైన వస్తువులు, సాంకేతికతను చైనా నుంచి పాకిస్థాన్ పొందుతున్నట్లు తాజా నివేదిక వెల్లడించింది. వీటిలో కొన్ని నేరుగా కాకుండా హాంకాంగ్, సింగపూర్, తుర్కియే, యూఏఈ దేశాల ద్వారా మళ్లిస్తున్నట్లు పేర్కొంది. అయితే, పాక్‌కు సైనిక పరికరాల ప్రధాన సరఫరాదారుగా చైనా ఉన్నప్పటికీ.. పాక్‌లో పనిచేస్తున్న చైనా జాతీయులను లక్ష్యంగా చేసుకొని ఇటీవల వరుస ఉగ్రదాడులు జరగడం ఆ దేశాల సంబంధాలను దెబ్బతీస్తున్నట్లు అంచనా వేసింది. జమ్మూకశ్మీర్‌లో గత నెల ఉగ్రదాడికి భారత్ స్పందించిన తీరును తాజా నివేదిక ప్రస్తావించింది. ఉగ్రదాడికి ప్రతిస్పందనగా.. పాక్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా భారత్ క్షిపణి దాడులను చేసిందని, అనంతరం ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగినట్లు తెలిపింది. భారత-చైనా సరిహద్దు ఉద్రిక్తతల గురించి ప్రస్తావిస్తూ.. బలగాల ఉపసంహరణ జరిగినప్పటికీ, సరిహద్దు వివాదం మాత్రం అపరిష్కృతంగానే ఉందని తెలిపింది.

## 150 మందిని నమ్మించి.. ట్రంప్ పేరుతో స్కామ్

టెక్నాలజీని వాడుకొని సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్న ఘటనలు వెలుగుచూస్తూనే ఉన్నాయి. తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరుతో కర్ణాటకలో దాదాపు 150మందిని నమ్మించి రూ. కోటికి పైగా దోచుకొన్నారు. సైబర్ మోసగాళ్ళు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించి డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతున్నట్లు వీడియోలను సృష్టించారు. తాను ట్రంప్ పేరుతో యాప్‌ను రూపొందించానని.. పెట్టుబడులు పెట్టాలని తద్వారా అధిక లాభాలు గడించవచ్చని అమెరికా అధ్యక్షుడు సూచిస్తున్నట్లు ఉన్న పలు వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. దీంతో కర్ణాటకలోని తుమకూరు, బెంగళూరు, హావేరి ప్రాంతాలలోని దాదాపు 150మంది ఆ వీడియోలను నమ్మి.. అందులో ఉన్న ఫోన్ నెంబర్‌కు కాల్ చేసి, యాప్‌లో పెట్టుబడులు పెట్టారు. వారికి యూఎస్ ప్రభుత్వానివే అని నమ్మించేలా ధ్రువీకరణ పత్రాలు కూడా జారీ చేశారు. కొద్ది నెలల పాటు వారు పెట్టిన పెట్టుబడులకు లాభాలు వచ్చినట్లు చూపిస్తూ.. డబ్బు, ఇతర బహుమతులు అందించారు. కొద్ది రోజులకు యాప్ నిర్వహకులు తమ కాల్స్‌కు సమాధానం ఇవ్వకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. సైబర్ మోసగాళ్ల వలలో పడి రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 150మంది కోటి రూపాయలకు పైగా విలువైన డబ్బు పోగొట్టుకున్నట్లు గుర్తించామని సైబర్ క్రైం పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇటువంటి నకిలీ యాప్‌లు, కంపెనీ విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని..సైబర్ మోసగాళ్ల వలలో పడొద్దని సూచించారు.



# హ్యాట్రిక్ విజయంతో అదిరే ముగింపు

## కోల్‌కతాపై సన్‌రైజర్స్ సూపర్ విక్టరీ

దిల్లీ: ఐపీఎల్ 2025 సీజన్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ భారీ విజయంతో ముగించింది. ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన తర్వాత జోరందుకున్న హైదరాబాద్.. కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన తమ ఆఖరి మ్యాచ్‌లో అంతకుమించిన దూకుడు ప్రదర్శించి వరుసగా మూడో విజయంతో ఈ సీజన్‌కు టాటా చెప్పింది. దిల్లీ వేదికగా జరిగిన మ్యాచ్‌లో కేకేఆర్‌పై హైదరాబాద్ 110 పరుగుల తేడాతో సూపర్ విక్టరీ సాధించింది. హెన్రిచ్ క్లాసెన్ (105, 39 బంతుల్లో 7 ఫోర్లు, 9 సిక్సులు) మెరుపు శతకం బాదడంతో తొలుత సన్‌రైజర్స్ 3 వికెట్ల నష్టానికి 278 పరుగుల భారీ స్కోరు చేసింది. ఈ కొండంత లక్ష్యఛేదనలో



కేకేఆర్ 18.4 ఓవర్లలో 168 పరుగులకు ఆలౌటైంది. మనీశ్ పాండే (37, 23 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సులు) టాప్ స్కోరర్. హర్షిత్ రాణా (34, 21 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సులు) చివర్లో మెరుపులు మెరిపించాడు. ఓపెనర్ సునీల్ నరైన్ (31, 16 బంతులలో 3 ఫోర్లు, 3 సిక్సులు) దూకుడుగా ఆడినా దాన్ని భారీ ఇన్నింగ్స్‌గా మలచలేకపోయాడు. అజింక్య రహానె (15), అంగ్‌క్రిష్ రఘువంశీ (14), రమణ్‌దీప్ సింగ్ (13), క్వింటన్ డాకాక్ (9), రింకు సింగ్ (9) పరుగులు చేశారు. రస్సెల్ ఎదుర్కొన్న తొలి బంతికే గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. హైదరాబాద్ బౌలర్లలో జయ్‌దేవ్ ఉనద్కత్ (3/24), ఎషాన్ మలింగ (3/31), హర్ష్ దూబె (3/34) అదరగొట్టారు. ఈ విజయంతో హైదరాబాద్ ప్రస్తుతానికి పాయింట్ల పట్టికలో ఆరో స్థానంలో నిలిచింది.

### మొదటి నుంచీ దూకుడే..

సన్‌రైజర్స్ బ్యాటర్లలో క్లాసెన్ శతకానికితోడు ట్రావిస్ హెడ్ (76, 40 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సులు) బౌండరీలతో విరుచుకుపడ్డాడు. అభిషేక్ శర్మ (32, 16 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సులు) క్రీజులో ఉన్నంతసేపూ మెరుపులు మెరిపించాడు. ఇషాన్ కిషన్ (29, 20 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. వైభవ్ అరోరా వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో రెండే పరుగులు రాగా.. తర్వాత నుంచి హైదరాబాద్ బ్యాటర్ల విధ్వంసం మొదలైంది. వైభవ్ వేసిన మూడో ఓవర్‌లో రెండు సిక్సులు, ఓ ఫోర్ బాదిన హెడ్.. హర్షిత్ బౌలింగ్‌లో మూడు ఫోర్లు బాదాడు. నరైన్ బౌలింగ్‌లో రెండు సిక్సులు బాదిన అభిషేక్ తర్వాత బంతికే ఔటైపోయాడు. కాసేపటికే హెడ్ అర్ధ శతకం (26 బంతుల్లో) అందుకున్నాడు. మరోవైపు, క్రీజులోకి వచ్చిన క్లాసెన్ కూడా దూకుడుగా ఆడటంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. వరుణ్ బౌలింగ్‌లో క్లాసెన్ మూడు ఫోర్లు బాదేయడంతో 10 ఓవర్లకు స్కోరు 139/1కి చేరింది. హర్షిత్ బౌలింగ్‌లో క్లాసెన్ వరుసగా 4, 6, 6 కొట్టి 17 బంతుల్లోనే హాఫ్ సెంచరీ అందుకున్నాడు. తర్వాత నరైన్ బౌలింగ్‌లో హెడ్.. రస్సెల్‌కు చిక్కాడు. క్లాసెన్, ఇషాన్ జోరు కొనసాగించడం



తో 18 ఓవర్లకు స్కోరు 250 దాటింది. దీంతో సన్‌రైజర్స్ తన పేరిట ఉన్న 287/3 స్కోరు రికార్డును తిరగరాస్తుందేమో అనిపించింది. అయితే, తర్వాతి ఓవర్లో వైభవ్ ఇషాన్‌ను ఔట్ చేసి ఏడు పరుగులే ఇచ్చాడు. చివరి ఓవర్‌లో 17 పరుగులే రావడంతో కొత్త రికార్డు నమోదు కాలేదు. కోల్‌కతా బౌలర్లలో సునీల్ నరైన్ 2, వైభవ్ అరోరా ఒక వికెట్ పడగొట్టారు.

ఐదు వరుస ఓటముల తర్వాత కోల్‌కతాపై హైదరాబాద్‌కు ఇది మొదటి విజయం. ఐపీఎల్‌లో కోల్‌కతాకు ఇది అతిపెద్ద ఓటమి. అంతకుముందు 2018లో ముంబయిపై 102 పరుగుల తేడాతో ఓడింది. హైదరాబాద్‌కు ఇది రెండో అతిపెద్ద విజయం. 2019లో ఆర్సీబీపై సన్‌రైజర్స్ 118 రన్స్ తేడాతో గెలిచింది.





## అయోధ్యలో హనుమంతుణ్ని దర్శించుకున్న విరాట్ కోహ్లీ, అనుష్క శర్మ

టీమ్ఇండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ, అనుష్క శర్మ అయోధ్యలోని ప్రముఖ హనుమాన్ గర్హి దేవాలయాన్ని ఆదివారం సందర్శించారు. హనుమంతుణ్ని దర్శించుకుని, ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ పూజారులు పూలమాలలతో కోహ్లీ, అనుష్క శర్మ దంపతులను సత్కరించారు. నుదుటన తిలకం దిద్దారు. తర్వాత స్వామివారి చిత్రపటాలను అందించారు. ఇటీవలే కోహ్లీ, అనుష్క శర్మ ఉత్తరప్రదేశ్‌లోని బృందావన్ ఆశ్రమాన్ని సం దర్శించారు. ఆధ్యాత్మిక గురువైన ప్రేమానంద్ గోవింద్ శరణ్ జీ మహరాజ్ ఆశీర్వాదాలు తీసుకున్నారు. టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత విరాట్ కోహ్లీ ఆధ్యాత్మికతకు ప్రాధాన్యం ఇస్తున్నాడు. అనుష్కశర్మతో కలిసి పలు క్షేత్రాలు సందర్శిస్తున్నాడు.



## బుమ్రాకు కెప్టెన్సీ ఇవ్వకపోవడం సరైన నిర్ణయం కాదు : సంజయ్ మంజ్రేకర్

సుదీర్ఘ ఫార్మాట్‌కు రోహిత్ శర్మ రిటైర్మెంట్ తర్వాత శుభ్‌మన్ గిల్‌కు కెప్టెన్సీ పగ్గాలు అప్పగించిన విషయం తెలిసిందే. టెస్ట్ ర్యాకింగ్స్‌లో ప్రస్తుతం నం.1 బౌలర్‌గా ఉన్న బుమ్రాకు సారథ్య బాధ్యతలు అప్పగించనందుకు భారత మాజీ క్రికెటర్, వ్యాఖ్యాత సంజయ్ మంజ్రేకర్ తన అసంతృప్తిని వ్యక్తం చేశాడు. ఫిట్‌నెస్ సమస్యలు, వర్క్‌లోడ్, అన్ని టెస్టు మ్యాచులు ఆడలేకపోవడం వంటివాటిని సెలెక్టర్లు కారణాలుగా చూపడాన్ని తప్పుబట్టాడు. 'జస్ప్రీత్ బుమ్రాకు టెస్ట్ కెప్టెన్సీ ఎందుకు ఇవ్వలేదో.. నాకైతే అర్థం కావడం లేదు. అతడు సిరీస్ మొత్తం ఆడలేడన్న కారణంగా కెప్టెన్‌గా ఎంపిక చేయకపోవడం సరైన నిర్ణయం కాదు. ఎందుకంటే రోహిత్ శర్మ ఇటీవల జరిగిన అయిదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో కేవలం మూడు మాత్రమే ఆడాడు. గతంలో విరాట్ కోహ్లీ కెప్టెన్‌గా ఉన్నప్పుడు కూడా అతడు కొన్నిసార్లు పూర్తి మ్యాచ్‌లు ఆడలేదు. బుమ్రా విషయంలో వర్తించిన సూత్రాలు గత కెప్టెన్లు అయిన విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ విషయంలో ఎందుకు వర్తించలేదు?' అని సంజయ్ మంజ్రేకర్ ప్రశ్నించాడు. ఇంగ్లండ్ టూర్‌కు వెళ్లనున్న భారత టెస్టు జట్టును శనివారం ప్రకటించిన సంగతి తెలిసిందే. అలాగే టీమ్ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్, వైస్ కెప్టెన్‌గా రిషభ్‌పంత్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా 'జస్ప్రీత్ బుమ్రా ఇంగ్లండ్ సిరీస్ మొత్తానికి అందుబాటులో ఉంటాడా?' అని విలేకరులు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌ను అడిగారు. 'డాక్టర్లు, ఫిజియోలు చెప్పిన ప్రకారం బుమ్రా సిరీస్‌లోని అన్ని మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటాడని నేనైతే అనుకోవడం లేదు' అని అతడు బదులిచ్చాడు.

# చెన్నై కొసమెరుపు

## ఆఖరి మ్యాచ్‌లో ఘనవిజయం
## గుజరాత్ టైటాన్స్ చిత్తు

**అహ్మదాబాద్ :** ఎప్పుడో ప్లేఆఫ్స్‌కు దూరమైన చెన్నై సూపర్‌కింగ్స్.. వెళ్తూ వెళ్తూ గుజరాత్ టైటాన్స్‌ను దెబ్బతీసింది. ఆదివారం ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో సీఎస్కే 83 పరుగుల తేడాతో టైటాన్స్‌పై ఘనవిజయం సాధించింది. బ్రెవిస్ (57బీ 23 బంతుల్లో 4ఐ4, 5ఐ6), కాన్వే (52బీ 35 బంతుల్లో 6ఐ4, 2ఐ6), ఉర్విల్ పటేల్ (37బీ 19 బంతుల్లో 4ఐ4, 2ఐ6), ఆయుష్ మాత్రే (34బీ 17 బంతుల్లో 3ఐ4, 3ఐ6) చెలరేగడంతో మొదట చెన్నై 5 వికెట్ల నష్టానికి 230 పరుగులు చేసింది. భారీ ఛేదనలో గుజరాత్ తేలిపోయింది. నూర్ అహ్మద్ (3/21), అన్షుల్ కాంబోజ్ (3/13), జడేజా (2/17) దాటికి 18.3 ఓవర్లలో 147 పరుగులకే ఆలౌటైంది. సాయి సుదర్శన్ (41బీ 28 బంతుల్లో 6ఐ4) టాప్ స్కోరర్. ప్రస్తుతానికి అగ్రస్థానంలోనే ఉన్నా.. ఆ జట్టు టాప్-2లో నిలవడం ఇతర మ్యాచ్‌ల ఫలితాలపైనే ఆధారపడి ఉంది. మొత్తంగా ప్లేఆఫ్స్ చేరే జట్లేవో ఎప్పుడో స్పష్టమైనా.. టాప్-4 స్థానాలు ఇప్పటికీ ఖరారు కాలేదు. లీగ్ పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలవడం తేలిపోయిన టైటాన్స్: ఛేదనలో గుజరాత్ చేతులెత్తేసింది. మూడో ఓవర్లోనే శుభ్‌మన్ గిల్ (13) వికెట్‌ను కోల్పోయిన ఆ జట్టు ఏ దశలోనూ విజయం దిశగా సాగలేదు. గిల్ నిష్క్రమణ తర్వాత వరుస ఓవర్లలో బట్లర్ (5), రూథర్‌ఫర్డ్ (0) కూడా ఔట్ కావడంతో 30/3తో చిక్కుల్లో పడింది. సాయి సుదర్శన్, షారుఖ్ ఖాన్ (19) నాలుగో వికెట్‌కు 45 పరుగులు జోడించినా.. కొండంత ఛేదనలో గుజరాత్‌కు అది ఏమాత్రం ఉపయోగ పడలేదు. 10 ఓవర్లలో ఆ జట్టు 85/3తో నిలవగా, రెండో స్పెల్‌లో బౌలింగ్‌కు వచ్చిన జడేజా.. ఒకే ఓవర్లో షారుఖ్, సుదర్శన్‌లను ఔట్ చేసి టైటాన్స్‌ను దెబ్బతీశాడు. దాంతో గుజరాత్ పరాభవం ఖాయమైపోయింది. మిగతా ఆట లాంఛనమే. మిగిలిన బ్యాటర్లు అద్భుతాలేమీ చేయలేకపోయారు. వచ్చిన వాళ్లు వచ్చినట్లే వెనుదిరిగారు. నూర్ అహ్మద్ చకచకా వికెట్లు పడగొట్టాడు. 37 పరుగుల వ్యవధిలో






టైటాన్స్ ఆఖరి అయిదు వికెట్లు చేజార్చుకుంది.

చెన్నై ధనాధన్: మొదట చెన్నై బ్యాటుతో అదరగొట్టింది. సమష్టిగా సత్తా చాటి ప్రత్యర్థికి భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చెన్నై.. ఓపెనర్ ఆయుష్ మాత్రే విధ్వంసంతో మూడు ఓవర్లకే 44/0తో నిలిచింది. అర్షద్ ఖాన్ ఓవర్లో మాత్రే వరుసగా 2, 6, 6, 4, 4, 6తో చెలరేగిపోయాడు. సిరాజ్ ఓవర్లో మరో ఓపెనర్ కాన్వే రెండు ఫోర్లు కొట్టాడు. నాలుగో ఓవర్లో మాత్రే వెనుదిరిగినా.. అతడి స్థానంలో వచ్చిన ఉర్విల్ పటేల్ బ్యాట్ ఝుళిపించాడు. కాన్వేతో రెండో వికెట్‌కు 63 పరుగులు జోడించి నిష్క్రమించాడు. ఆ తర్వాత శివమ్ దూబె (17)తో కలిసి మూడో వికెట్‌కు కాన్వే 37 పరుగులు జోడించాడు. 13వ ఓవర్లో దూబె, ఆ తర్వాతి ఓవర్లోనే కాన్వే నిష్క్రమించడంతో చెన్నై 156/4తో నిలిచింది. కానీ గుజరాత్‌కు ఉపశనమేమీ లేదు. యువ బ్యాటర్ బ్రెవిస్ విరుచుకుపడడంతో ఆఖరి 5 ఓవర్లలో చెన్నై 67 పరుగులు రాబట్టింది. సిరాజ్ వేసిన ఇన్నింగ్స్ 19వ ఓవర్లో బ్రెవిస్ వరుసగా 6, 6, 4 దంచేశాడు. అతడు కేవలం 19 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేశాడు. జడేజా (21 నాటౌట్)తో అయిదో వికెట్‌కు వేగంగా 74 పరుగులు జోడించిన బ్రెవిస్.. ఆఖరి బంతికి ఔటయ్యాడు.

రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం తెలుగు దినపత్రిక





## ఇండియన్ ఆర్మీకి ప్రీతి జింటా భారీ విరాళం

బాలీవుడ్ హీరోయిన్ ప్రీతి జింటా గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన పని లేదు. పలు చిత్రాల్లో నటించి ఫుల్ ఫేమ్ తెచ్చుకుంది. అలాగే ఆమె తెలుగు స్టార్స్ మహేష్ బాబు, వెంకటేష్ వంటి స్టార్ హీరోల సినిమాల్లో నటించి మెప్పించింది. గత కొద్ది కాలంగా సినిమాలకు దూరంగా ఉంటున్న ఆమె బిజినెస్‌లోకి అడుగుపెట్టింది. అంతేకాకుండా ఐపీఎల్‌లోనూ హుషారుగా పాల్గొంటుంది. పంజాబ్ కింగ్స్ సహ యజమానిగా కూడా వ్యవహరిస్తోంది. అలాగే సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటున్న ప్రీతిజింటా పలు విషయాలపై స్పందిస్తూ క్లారిటీ ఇస్తోంది. తాజాగా, ఓ కార్యక్రమంలో పాల్గొన్న ప్రీతిజింటా ఇండియన్ ఆర్మీకి భారీ విరాళం ప్రకటించింది. కమాండ్‌లోని ఆర్మీ వెల్ఫేర్ అసోసియేషన్‌కు ప్రీతి జింటా రూ. 1.10 కోట్ల విరాళం ఇచ్చింది. జైపూర్‌లో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా సౌత్ వెస్ట్రన్ కమాండ్ ఆర్మీ కమాండర్, ప్రాంతీయ అధ్యక్షుడు శప్తా శక్తి ఆర్మీ కుటుంబాలు హాజరైన సందర్భంగా ఈ విరాళం అందచేయడం జరిగింది. ఇక ఈ విసయంపై ఆమె మాట్లాడుతూ.. "మన సాయుధ దళాల ధైర్యవంతులైన కుటుంబాలకు సహాయం అందించడం గౌరవం బాధ్యత. మన సైనికులు చేసిన త్యాగాలను ఎప్పటికీ నిజంగా తిరిగి చెల్లించలేము. అయితే, మనం వారి కుటుంబాలకు అండగా నిలిచి ముందుకు సాగడంలో వారికి మద్దతు ఇవ్వగలం. భారత సాయుధ దళాల పట్ల నాకు ఎంతో గర్వంగా ఉంది. మన దేశం కోసం పోరాడే ధైర్యవంతులైన రక్షకులకు అచంచలమైన మద్దతుగా నిలుస్తాము" అని చెప్పుకొచ్చింది. ఇక ఈ విషయం సోషల్ మీడియాలో పలు వార్తలు వైరల్ అవుతుండటంతో.. అసలు విషయం తెలుసుకున్న నెటిజన్లు ఆమెపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

## నేను ప్రముఖుల కుటుంబం నుంచి వచ్చుంటే..

యంగ్ హీరోయిన్ అదా శర్మ 'హార్ట్ ఎటాక్' చిత్రంతో తెలుగు తెరకు ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించినప్పటికీ అంతగా గుర్తింపు తెచ్చుకోలేదు ఈ బ్యూటీ. కానీ.. 2023లో వచ్చిన 'ది కేరళ స్టోరీ' చిత్రంతో ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది. ఆ మూవీలోని అదా యాక్టింగ్‌కు విమర్శకుల ప్రశంసలు అందాయి అనడంలో అతిశయోక్తి లేదు. దీని తర్వాత 'బస్తర్: ది నక్సల్ స్టోరీ'లో కూడా నటించి మెప్పించింది. ఇదిలా ఉంటే.. ఇటీవల బాలీవుడ్ నెపోటిజంపై స్పందించిన ఈ బ్యూటీ షాకింగ్ కామెంట్స్ చేసింది. '2008లో వచ్చిన '1920' అనే హారర్ చిత్రంతో నా సినీ లైఫ్‌ను స్టార్ట్ చేశాను. అయితే.. నేను ఓ సినిమా కుటుంబానికి చెందిన వ్యక్తిని అయుంటే.. నన్ను వెండితెరకు పరిచయం చేయడానికి ఒక పర్ఫెక్ట్ రొమాంటిక్ సినిమా ఎంచుకునేవారు. నా కుటుంబం నన్ను హారర్ సినిమా చేయనిచ్చేవారు కాదు. ఎందుకంటే తన బిడ్డ కెరీర్‌ను నల్లటి పళ్లతో దెయ్యం పట్టినట్టు మొట్టమెదటి సారి చూపించడానికి ఎవరు ఒప్పుకుంటారు. అందుకే ప్రముఖుల కుటుంబం నుంచి నేను వచ్చుంటే ఓ రొమాంటిక్ చిత్రంతో నా ఎంట్రీ ఉండేది.. కానీ నేను '1920'తో స్టార్ట్ చేశాను. అందుకు నేను అదృష్టవంతురాలిగా భావిస్తున్నాను. ఏదైనా కొత్తగా ప్రయత్నించే అవకాశం నాకు ఉంటుంది. అలాగే.. నేను ప్రయత్నించే ప్రతి కొత్త విషయాన్ని ప్రేక్షకులు అంగీకరిస్తున్నారు. బహుశా అందుకే సినీ నిర్మాతలు కూడా నాకు విభిన్న పాత్రలు ఇవ్వడానికి చూస్తున్నారు' అంటూ చెప్పుకొచ్చింది.



## ఆ వార్త చూసి నా హార్ట్ బ్రేక్ అయింది

బాలీవుడ్ నటుడు ముకుల్ దేవ్ మరణించిన విషయం తెలిసిందే. 'దస్తక్' సినిమా ద్వారా వచ్చిన ఆయన తెలుగులో రవితేజ కృష్ణ చిత్రంలో విలన్‌గా నటించి ఫుల్ ఫేమ్ తెచ్చుకున్నాడు. అయితే గత వారం రోజులుగా ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న ఆయన ఆరోగ్యం విషమించడంతో మే 24న ప్రాణాలు కోల్పోయారు. ఇక ఈ విషయంపై పలువురు సినీ సెలబ్రిటీలు సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో.. తాజాగా, మృణాల్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఓ పోస్ట్ పెట్టింది. ఆయన ఫొటో షేర్ చేస్తూ.. "ఈ వార్త చూసి హార్ట్ బ్రేక్ అయింది. ముకుల్ దేవ్ మరణించాడంటే అస్సలు నమ్మలేకపోతున్నాను" అని రాసుకొచ్చింది. ప్రస్తుతం ఆమె పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కాగా, మృణాల్ సినిమాల విషయానికొస్తే.. 'సితారామం' చిత్రంతో ఓవర్ స్టార్‌గా మారిపోయింది. ప్రస్తుతం వరుస మూవీస్ చేస్తూ ఫుల్ ఫామ్‌లో ఉంది. ఇప్పుడు మృణాల్ టాలీవుడ్, బాలీవుడ్ ఇండస్ట్రీలో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తోంది. డెకియిట్‌తో పాటు ఓ హిందీ ప్రాజెక్ట్ చేస్తున్న ఆమె సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటుంది. అభిమానులతో ముచ్చటిస్తూ నిత్యం వార్తల్లో నిలుస్తోంది.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98,
**RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com